
# రాజ్యం మతం కులం

కె. బాలగోపాల్

HRF



# రాజ్యం మతం కులం

కె. బాలగోపాల్

మానవహక్కుల వేదిక ప్రచురణ
Human Rights Forum (HRF)

**రాజ్యం – మతం – కులం**

కె. బాలగోపాల్

మానవహక్కుల వేదిక ప్రచురణ

**A Human Rights Forum Publication**

ప్రచురణ సంఖ్య: 64

మొదటి ముద్రణ : డిసెంబర్ 2024

వెల : రూ. 50/–

**ముద్రణ :**
అనుపమ ప్రింటర్స్, గ్రీన్ వ్యూ,
126 శాంతినగర్, హైదరాబాద్ – 28
ఫోన్ : 040– 23391364, 35928628
Email: anupamaprinters@yahoo.co.in

**ప్రతులకు:**

ఎ. చంద్రశేఖర్, 7993919499

వి. వసంతలక్ష్మి 9985411455

మా వెబ్‌సైట్: www.humanrightsforum.org

బాలగోపాల్ రచనల కోసం: www.balagopal.org

# మా మాట

**బా**లగోపాల్ ఎప్పుడో ఇచ్చిన ఒక ఉపన్యాసాన్ని ఏడాది క్రితం 64 పేజీల ఒక చిన్న పుస్తకంగా తీసుకొచ్చాం. దాని పేరు 'కులాన్ని అర్థం చేసుకోవడం ఎలా?' ఇప్పటికే 2000 కాపీలు అమ్ముడయ్యాయి. నిజానికి అది 'కులవ్యవస్థ – చారిత్రక భౌతికవాదం' పేరుతో అప్పటికే YouTube లో ఉన్న ఉపన్యాసమే. అయినా దాన్ని పుస్తకరూపంలో చదవడానికి అంతమంది ఇష్టపడడం ఇప్పుడు ఈ రెండో పుస్తకానికి ప్రేరణ. ఇందులోని ఈ రెండు ఉపన్యాసాలు కూడా 'భారతదేశంలో లౌకికవాదం అంటే కుల నిర్మూలనే', 'హిందూ మతతత్వం – భారత రాజకీయాలు' అనే పేర్లతో YouTube లో ఉన్నాయి, balagopal.org లోనూ ఉన్నాయి. వినడానికి ఉపన్యాసం ఎంత బాగున్నా, లోతుగా అర్థం చేసుకోవడానికి, వివేచించుకోవడానికి పుస్తకాలే ఎక్కువ ఉపయోగకరమని భావించి ఇప్పుడు వీటిని కూడా transcribe చేసి, edit చేసి పుస్తక రూపంలో తీసుకొస్తున్నాం.

బాలగోపాల్ అన్ని వ్యాసాలు, ఉపన్యాసాలలోనూ ఆలోచనాత్మక విషయాలు అనేకం ఉండే మాట నిజమే కాని ఈ రెండూ మరో మెట్టు పైనున్నాయని చెప్పొచ్చు. ముఖ్యంగా మన దేశానికి సంబంధించినంత వరకు లౌకికవాదం అంటే ఏమిటో; రాజ్యానికి – మతానికి, రాజ్యానికి – కులానికి ఉండాల్సిన సంబంధం ఏమిటో eyeopener గా అనిపించే విషయాలు ఇందులో చాలా ఉన్నాయి. మిగతా దేశాలలో లౌకికవాదానికి ఉన్న అర్థం వేరు, మన దేశంలో ఉన్న అర్థం వేరు. సెక్యులర్ అనే పదాన్ని ఇందిరాగాంధీ 1975 లో రాజ్యాంగంలో చేర్చాక మాత్రమే భారతదేశం లౌకిక దేశంగా మారిందనుకోవడం తప్పు అని, ఆ పదం లేకుండానే లౌకికవాద విలువల్ని అంబేద్కర్ రాజ్యాంగంలో ఏ ఏ ఆర్టికల్స్‌లో పొందుపరిచారో బాలగోపాల్ ఈ ఉపన్యాసాలలో సవివరంగా తెలియజేశారు. ఆ విధంగా అసలైన అర్థంలో లౌకికవాద భావన మన రాజ్యాంగంలోనే అంతర్భాగంగా ఉందని నిరూపించారు.

మన దేశంలో అసమాన సామాజిక వ్యవస్థను నిలబెడుతున్నది మతమేనని బాలగోపాల్ పదే పదే ఎన్నో ఉదాహరణలతో చెప్పారు. ప్రజా వనరులను కొల్లగట్టి కార్పొరేట్లకు అప్పగించే విషయంలో హిందుత్వం, సరళీకరణ భావజాలాలు ఎంత సమ జోడీలుగా వ్యవహరిస్తున్నాయో కూడా చెప్పారు. లౌకికవాదానికి బి.జె.పి ఒక్కటే కాదు శత్రువు, మనలోనూ ఉన్నారు చాలామంది శత్రువులు, నిజానికి వీరే ఎక్కువ ప్రమాదకారులంటారు ఆయన. ఆధిపత్యం ఏ రూపంలో ఉన్నా అది లౌకికవాదానికి, ప్రజాస్వామ్యానికి ముప్పే నంటారు.

ఒకటికి రెండుసార్లు చదివి అర్థం చేసుకోవాల్సిన, చర్చించాల్సిన వ్యాసాలివి.

**మానవహక్కుల వేదిక**

6 డిసెంబర్ 2024

# భారతదేశంలో
# లౌకికవాదం అంటే కులనిర్మూలనే

ప్రభుత్వ సహకారంతోనే అయోధ్యలో బాబ్రీ మసీదును కూల్చివేయడం, దేశానికి ముఖ్య నేతలుగా ఉన్నవాళ్ళు రాజ్యాంగ యంత్రాంగంలో, అధికార యంత్రాంగంలో పదవులు నిర్వహిస్తూనే మతపరమైనటువంటి వ్యక్తులుగా ఫోకస్ కావడం – ఇవన్నీ ఈ మధ్యకాలంలో వార్తలలో వచ్చాయి, మనం కూడ చూస్తూ ఉన్నాం. దేశ రాజకీయాలలో ఇదొక ముఖ్యమైన అంశంగా కూడ మారింది. అందువల్ల ఆధునిక కాలంలో ఒక ప్రజాస్వామిక దేశంలో – ప్రజాస్వామ్యాన్ని ఒక రాజకీయ వ్యవస్థగా నిలుపుకోవాలని కాంక్షిస్తున్న దేశంలో – మతానికి రాజ్యానికి ఉన్నటువంటి సంబంధం, ఉండవలసినటువంటి సంబంధం గురించి చర్చ ఇప్పుడు బాగా జరుగుతూ ఉంది.

రాజ్యం అంటే కేవలం ప్రభుత్వం కాదు. అంటే మంత్రులు, ఐఎఎస్ ఆఫీసర్లు, ఐపిఎస్ ఆఫీసర్లు, ప్రభుత్వ యంత్రాంగం మాత్రమే కాదు, దానిలో న్యాయవ్యవస్థ కూడ ఒక ముఖ్యమైన భాగమే. కోర్టులు, జడ్జీలు, అట్లాగే శాసన వ్యవస్థ కూడ. అసెంబ్లీలుగానీ, పార్లమెంట్‌గానీ, మొత్తంగా దేశాన్ని పరిపాలించేటువంటి, దేశాన్ని శాసించేటువంటి, శాసనాన్ని అమలు చేసేటువంటి, శాసనాన్ని నిర్ణయించేటువంటి వ్యవస్థలన్నీ కలిసి రాజ్యం అనిపించుకుంటాయి.

ఆధునిక కాలంలో ఒక ప్రజాస్వామిక దేశంలో మతానికి రాజ్యానికి ఉన్నటువంటి సంబంధం, ఉండవలసినటువంటి సంబంధంతో పాటు మనం ఏ రకమైనటువంటి సంబంధం కోరుకుంటున్నాము అనేది కూడ ఇవ్వాళ ఒక ముఖ్యమైన చర్చనీయాంశం అయ్యింది. కొంతవరకు జోక్ కూడ అయిపోయింది. ముఖ్యంగా శంకర్ దయాళ్ శర్మ విషయంలో. ఆయన ఇంకా పుట్టపర్తిలో ఉన్నాడో వెళ్ళిపోయాడో తెలియదు. రెండు వారాలకు ఒకసారి వచ్చి పోతుంటాడు. తిరుపతి కొస్తాడు, అక్కడ నుంచి శ్రీశైలానికి

ఒకసారి, పుట్టపర్తికి ఇంకోసారి వెళతాడు. వెనక్కి పోతాడు. రెండు వారాలకి మళ్ళీ వస్తాడు. అదీ మన ఖర్చుతో. ఆయన చాలా కాలంగా నాయకుడుగా ఉన్నాడు, ఆస్తులు సంపాదించుకునే ఉంటాడు, ఆ డబ్బు పెట్టుకుని వస్తే మనకేమీ అభ్యంతరం లేదు. కాని ప్రజల ఖర్చుతో ఆయన పదే పదే వచ్చిపోతూ ఉన్నాడు. ఆ జిల్లాలలో అయితే, ముఖ్యంగా చిత్తూరు జిల్లాకు పోతే ప్రజలెప్పుడూ కంప్లైంట్ చేస్తూ ఉంటారు – కలెక్టర్‌తో ఏ పని ఉందని పోదామన్నా శంకర్ దయాళ్ శర్మ తిరుపతికొచ్చాడు కాబట్టి కలెక్టర్ తిరుపతికి పోయాడంటున్నారు, మాకు కలెక్టర్‌ను కలవడం సాధ్యం కావడం లేదని. ప్రజలకి అది నిత్యజీవిత సమస్య కూడ అయిపోయింది.

## రాముడి మీద ఎలా పోరాటం చేయను : పి.వి

అక్కడినుంచి మొదలు పెడితే రాజ్యాధికారానికి రావడానికి మతాన్ని వాడుకోవడం ఒక్క భారతీయ జనతా పార్టీ వాళ్ళు మాత్రమే కాదు, మొత్తంగానే అధికార యంత్రాంగం, పదవులలో ఉండేవాళ్ళు, అధికారులుగా ఉండేవాళ్ళు, వాళ్లందరి ఆలోచనల్లో, వాళ్ళందరి అవగాహనలో కూడ మతానికి, మతతత్వానికి ప్రాముఖ్యం బాగా పెరుగుతూ వస్తోంది. వివేకానందుడు చికాగోలో మాట్లాడిన సందర్భానికి ఆ మధ్య ఢిల్లీలో శతాబ్ది ఉత్సవం జరిగింది. ఆ ఉత్సవంలో పి.వి.నరసింహారావు దాదాపు గంటంపావు మాట్లాడాడు. ఆయన భారత దేశానికి ప్రధానమంత్రి. కాంగ్రెస్‌పార్టీ నాయకుడు. మతాన్ని రాజకీయం చేయాలని బి.జె.పి ప్రభుత్వం ప్రయత్నం చేస్తూ ఉందని ఆరోపణలు చేస్తూ, మతాతీతమైన రాజకీయ వ్యవస్థ కోసం నేను నిలబడ్డాను అని చెప్పుకుంటున్న వ్యక్తి. ఆయన ఆ రోజు ఇచ్చిన ఉపన్యాసం – చేతిలో ఒక కాగితంగానీ, పుస్తకంగానీ ఏమీ లేకుండా అనర్గళంగా మతగ్రంథాల నుంచి, ధర్మశాస్త్రాల నుంచి, పురాణాల నుంచి ఉటంకిస్తూ మాట్లాడుతూ ఉంటే కింద కూర్చున్న బి.జె.పి నాయకులు ఆయన ఉండగా ఇంక మేమెందుకు అనుకున్నారని చెప్పి పేపర్‌లో వార్తలు రాశారు. ఎందుకంటే బి.జె.పి నాయకులకు చాలామందికి అంత పాండిత్యం లేదు, పి.వి. నరసింహారావుకున్నంత. వివేకానందుడు నూరేళ్ళ కింద చికాగోలో ఏమి చెప్పాడు అనేది ఆయన అనర్గళంగా చెప్పుకుపోతున్నాడు. మాట్లాడుతున్నది కేవలం పాండిత్యం కాదు, ఆయన అవగాహనలో భాగం, అవన్నీ కూడ ఆయన ఆలోచనలలో భాగమైపోయిన విషయాలు.

అంతకుముందు బాబ్రీ మసీదు కూల్చివేత తరువాత ఆయనే ఒకసారి ఆవేదనగా ఢిల్లీలో మాట్లాడుతూ 'నేను బి.జె.పి మీద పోరాటం చెయ్యగలను గానీ రాముడి మీద

ఎట్లా పోరాటం చేసేది' అన్నాడు. I can fight the BJP, but I cannot fight Ram అన్నాడు. రాముడి మీద నేను పోరాటం చెయ్యలేను అంటే రాముడు అనే ఆ దేవుడి మీద అని కాదు. మతం, మతతత్వం, రాజకీయాలలో మతం, సామాజిక వ్యవస్థలో మతం దానిని నేను వ్యతిరేకించలేను అని చెప్పడం. బి.జె.పి మీద నేను ఎన్నికలలో మాత్రమే పోటీ చేయగలను అనే స్థితికి కాంగ్రెస్ పార్టీ నాయకులు రావడాన్ని మనం ఎలా అర్థం చేసుకోవాలి? ఇవన్నీ మతానికి ఉన్న రాజకీయ పాత్ర గురించి, ఆ రాజకీయ పాత్ర పట్ల మనకు ఉండవలసిన అప్రమత్తత గురించి మన కర్తవ్యాన్ని మనకు జ్ఞాపకం చేసే విషయాలు.

## నిజమే లౌకికవాదం మూలాలు పాశ్చాత్య దేశలలోనే కానీ...

అయితే ఇక్కడ మనం మతం అనేటప్పుడు దానిని కేవలం కొన్ని విశ్వాసాలుగా, నమ్మకాలుగా మాత్రమే కాకుండా ఆర్థిక, రాజకీయ, సామాజిక వ్యవస్థలలో దానికుండేటువంటి పాత్రను మనం అర్థం చేసుకోవాల్సిన అవసరం చాలా ఉంది. రాజ్యం–మతం, ప్రభుత్వం – మతం అని మనం ఆలోచిస్తున్నామంటేనే దాని వెనకాల పాశ్చాత్య దేశాల లౌకికవాద సంప్రదాయం ఉంది. పాశ్చాత్య దేశాలలో మతాన్ని రాజ్యం నుండి వేరు చేయడమనేది ఒక ముఖ్యమైన లౌకికవాద విలువగా ముందుకు వచ్చింది. మతాన్ని రాజ్యం నుండి వేరు చేయడం అంటే అర్థం ఏమిటి? ప్రభుత్వ వ్యవహారాలలోగానీ, రాజ్యాంగ యంత్రాంగం వ్యవహారాలలోగానీ మతం ప్రమేయం, మతం ఆధిపత్యం ఉండకూడదు అని; ఆధ్యాత్మిక ప్రాతిపదిక మీద కాకుండా లౌకిక ప్రాతిపదిక మీద ప్రభుత్వ నిర్ణయాలు జరగాలి అని. ఇవన్నీ పాశ్చాత్య దేశాల చరిత్ర నుంచి మనకు వచ్చినటువంటి కొన్ని ఆలోచనలు. అవి తప్పు కాదుగానీ మన దేశానికి వాటిని వర్తింపజేసేటప్పుడు మతం అనేదానికి మన దేశంలో ముఖ్యంగా హైందవ సమాజంలో ఉండే నిర్దిష్టమైన రూపాన్ని, నిర్దిష్టమైన అర్థాన్ని కూడ దానికి జోడించి ఆలోచించాల్సిన అవసరం ఉంది.

బ్రిటన్‌లో గానీ, ఫ్రాన్స్‌లో గానీ ఆయా దేశాల పరిపాలకులు – అంటే రాజులు, రాణులు, వాళ్ళ ప్రవర్తన, వాళ్ళ వ్యక్తిగత జీవిత వ్యవహారాలు, వాళ్ళ పరిపాలనా విధానాలు ఇవన్నీ కూడ క్రైస్తవ మతాధిపతుల అనుమతికి, శాసనానికి లోబడి నడుస్తూ ఉండేవి. చివరికి కొంతమంది రాజుల వివాహాలను కూడ క్రైస్తవ చర్చి ఒప్పుకుంటుందా, ఒప్పుకోదా; ఒప్పుకోకపోతే రాజుగారు ఏం చెయ్యాలి అనే సమస్యలూ వచ్చాయి. ఆధునిక కాలంలో

సమాజం మీద మతం ఆధిపత్యం అనే విషయాన్ని రాచరికం మీదా, రాజుల మీదా, రాజ్యం మీదా, రాజుల పరిపాలన మీదా మతాధికారుల శాసనం అనే ఒక నిర్దిష్టమైన రూపంలో దానిని ఒక ప్రశ్నగా, ఒక సమస్యగా గుర్తించడం, దానిపై పోరాటం చేయడం; మతం అంటే కేవలం నీకు, నువ్వు నమ్మే దేవుడికి మధ్య ఉండే సంబంధం తప్ప అదొచ్చి బయట రాజ్యాన్ని శాసించటానికి వీలు లేదు; నీకు దేవుడి మీద నమ్మకం ఉంటే నువ్వు పూజించుకో, ప్రార్థనలు చేసుకో, అంతవరకే. దానికి నీకు పూజారులు కావాలి, పురోహితులు కావాలి అంటే నువ్వే పెట్టుకో. అంతే తప్ప ఈ పూజారులు, ఈ మతాధిపతులు బయటకొచ్చి రాజ్యాన్ని మేము శాసిస్తాము అంటే కుదరదు అనే ఒక నిర్దిష్టమైన రూపంలో లౌకికవాదం అనేది పుట్టింది పాశ్చాత్య దేశాలలో.

## సెక్యులరిజాన్ని మనం ఎలా అర్థం చేసుకోవాలి?

మతాన్ని రాజ్యం నుండి వేరు చేయడం, రాజ్యాన్ని మతం నుండి వేరు చేయడం, రాజకీయాలను మతం నుండి వేరు చేయడం అనే అర్థంలో దానిని వ్యాఖ్యానించుకొంటూ వస్తున్నాం. దానికి అదనంగా భారతదేశంలో నిర్దిష్టమైన పరిస్థితిలో లౌకికవాదం అంటే ఏమిటి? మతం అంటే ఏమిటి? మతానికి, రాజ్యానికి మధ్య సంబంధం ఎలా ఉండాలి? కేవలం రాజకీయ వ్యవహారాలలోనూ, పరిపాలనా యంత్రాంగం వ్యవహారాలలోనూ మతం జోక్యం ఉండకూడదు, అంటే మతాధిపతుల జోక్యం ఉండకూడదు అని మాత్రమేనా? ఒక ప్రభుత్వ కార్యాలయానికి శంకుస్థాపన చేసేటప్పుడు టెంకాయలు కొట్టడమో, లేకపోతే ఒక బ్రాహ్మణుడు వచ్చి మంత్రాలు చదవడమో ఉండకూడదు అని మాత్రమేనా? కిందటి సంవత్సరం హైదరాబాద్‌లో వర్షాలు పడకపోతే యజ్ఞాలు చేయించారు, కరువొస్తే యజ్ఞం చేయించారు. అటువంటివి జరపకూడదు అనే దానికి మాత్రమే మనం పరిమితం కావాలా? లేకపోతే మతం అనేదానికి భారతీయ సమాజంలో, హైందవ సమాజంలో ఉండే అర్థాన్ని మరింత సమగ్రంగా అవగాహన చేసుకుని, రాజ్యానికి, మతానికి మధ్య ఉండవలసిన సంబంధాన్ని ప్రతిపాదించుకోవాలా అనే ప్రశ్న మన ముందుకు వస్తుంది.

భారత రాజ్యాంగంలో సావరిన్, సెక్యులర్, సోషలిస్ట్ రిపబ్లిక్ అని ఉంటుంది. అంటే సర్వసత్తాక, లౌకిక, సోషలిస్టు గణతంత్రం అని. భారత రాజ్యాంగాన్ని 1950లో మొట్టమొదట ఆమోదించినప్పుడు దానిలో డెమోక్రటిక్, సావరిన్ అనే మాటలు మాత్రమే ఉన్నాయి. సోషలిస్టు, సెక్యులర్ అనే మాటలు లేవు. ఇందిరాగాంధీ ఎమర్జెన్సీలో

రాజ్యాంగాన్ని సవరించినప్పుడు 42వ రాజ్యాంగ సవరణలో సోషలిస్టు అనే మాటను, సెక్యులర్ అనే మాటను రాజ్యాంగంలోకి చేర్చారు. మరి అప్పుడే పుట్టిందా భారత రాజ్యాంగంలో సెక్యులరిజం అనేది, లౌకికవాదమనేది? ఇది వాస్తవం కాదు.

రాజ్యాంగాన్ని రాసినప్పుడే హైందవ సంప్రదాయమున్న భారత దేశానికి ఏది లౌకికవాదమవుతుంది అనేది రాసుకున్నారు. అది వివిధ ఆర్టికల్స్‌లో ఉన్నాయి. ప్రాథమిక హక్కుల జాబితాలో ఉన్నాయి, ఆదేశిక సూత్రాల జాబితాలో ఉన్నాయి. దాని శీర్షికలలో (టైటిల్స్) లేకపోవచ్చు. అవి ఎక్కడ ఉన్నాయి అనంటే అంబేద్కర్ చాలా పట్టుదలగా రాసినటువంటి కొన్ని విషయాలలో ఉన్నాయి. కులవ్యవస్థకు వ్యతిరేకంగా, కులవివక్షకు వ్యతిరేకంగా, వర్ణధర్మానికి వ్యతిరేకంగా రాసిన విషయాలు భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 15, 16, 17లలో ఉన్నాయి. అవే మన నిజమైన సెక్యులరిజం.

## వర్ణ/కుల వ్యవస్థలను వ్యతిరేకించడమే మన లౌకికవాదం కావాలి

హైందవ మతం అంటే ప్రధానంగా వర్ణ ధర్మమే. భారతదేశంలో మనం మతానికి, రాజ్యానికి ఉన్న సంబంధం గురించి ఆలోచిస్తున్నామంటే వర్ణ ధర్మానికి, కులవ్యవస్థకు, రాజ్యానికి ఉన్న సంబంధం ఏమిటి అనేదే దానిలో కీలకమైన విషయం అవుతుంది. ఒక ప్రభుత్వ కార్యాలయాన్నో, ఒక బ్రిడ్జినో, ఒక కొత్తరైలునో ప్రారంభించేటప్పుడు కొబ్బరికాయలు కొడుతున్నారా లేదా, మంత్రాలు చదువుతున్నారా లేదా అనేది దీనితో పోలిస్తే చిన్న విషయం అవుతుంది. ప్రధానమైన విషయం ఏమవుతుంది అంటే వర్ణధర్మం, వర్ణవ్యవస్థ, కులవ్యవస్థ. వీటికీ రాజ్యాంగ యంత్రాంగానికీ, వీటికీ రాజకీయాలకూ మధ్య ఉండే సంబంధం ఏమిటనేదే భారతదేశంలో లౌకికవాదానికి ప్రధానమైన ప్రాతిపదిక అవుతుంది. పరిపాలనా వ్యవహారాల నుంచి మతాన్ని దూరంగా ఉంచాలి అనేది లౌకికవాదంలో ఒక అంశమే కాని అది చాలా చిన్న అంశం. భారతదేశంలో లౌకికవాదం అంటే సామాజిక వ్యవస్థలో వర్ణధర్మాన్ని, కులవ్యవస్థను వ్యతిరేకించడమూ, తొలగించడమే ప్రధానమైన అంశం అవుతుంది. మామూలుగా హిందూ ధర్మ ప్రచారకులు అంటూ ఉంటారు – హిందూ మతం అనేది మతం కాదు, అదొక జీవన విధానం, It is a way of Life అని. మీరు దేవుడు ఉన్నాడా లేడా అనే ప్రశ్నలు ఎంత వేసుకున్నా మీరు హిందూ మతాన్ని గురించి మాట్లాడినట్లు కాదు, ఇదొక జీవన విధానం కాబట్టి దీనిని క్రైస్తవంతో పోల్చకూడదు, ఇస్లాంతో పోల్చకూడదు అంటూ ఉంటారు. అది వాస్తవమే.

కానీ ఏమిటి ఆ జీవన విధానం? అది వర్ణధర్మం. హిందూమతం సారాంశం ఏమిటంటే వర్ణధర్మం అనే జీవన విధానం; కులవ్యవస్థ, వర్ణవ్యవస్థ అనే జీవన విధానం, అదే హైందవంలో చాలా ప్రధానమైనది.

సెక్యులర్ అనే మాట భారత రాజ్యాంగంలోకి 1975 లో వచ్చి ఉండొచ్చు గాని చట్టం ముందర అందరూ సమానమే అని చెప్పే ఆర్టికల్ 14 గానీ, కుల వివక్షను ఏ రూపంలోను పాటించటానికి వీల్లేదు అని చెప్పే ఆర్టికల్ 15 గానీ, ప్రభుత్వ ఉద్యోగాలలో కులం రీత్యా ఎవరికైతే సమానమైనటువంటి ప్రాతినిధ్యం లేదో వాళ్ళకు ప్రాతినిధ్యం కల్పించాలి అని రిజర్వేషన్లకు అవకాశమిచ్చే ఆర్టికల్ 16 గానీ, అంటరానితనాన్ని పేరుపెట్టి నిషేధించేటువంటి ఆర్టికల్ 17 గానీ ఇవన్నీ అంతకంటే చాలా ముందు నుండే భారత రాజ్యాంగం రూపొందినప్పటి నుండే ఉన్నాయి. అదీ మన లౌకికవాదం. దానినే ఇవ్వాళ ముందుకు తీసుకుపోవడం, విస్తరించడం చాలా అవసరం. ఎందుకంటే మతం అనేది కేవలం, నేను మొదట చెప్పినట్టు, ఒక విశ్వాసం మాత్రమే కాదు. దేవుడి మీద విశ్వాసం, ఆ దేవుడి యొక్క మహిమలు, వాటి మీద విశ్వాసం, అదొక అంశం. క్రైస్తవంలో అది ఏ రకంగా వచ్చిందో నెల్సన్ గారు (అంతకుముందు మాట్లాడిన వ్యక్తి) వివరంగా చెప్పారు.

## అధికారం కోసమే మతాన్ని వాడుకుంటున్నారు

దాంతోపాటు మతం అనేది అన్ని దేశాలలోను, ప్రత్యేకించి హైందవ సంప్రదాయంలోను, ఇతర సంప్రదాయాలలోనూ కూడ ఒక సామాజిక వ్యవస్థలో భాగం, రాజకీయ వ్యవస్థలో భాగం. అదొక సామాజిక సంబంధం. సామాజిక సంబంధం మాత్రమే కాకుండా అదొక భావజాలం కూడ, ఒక ప్రాపంచిక దృక్పథం. సామాజిక సంబంధంగాను, భావజాలంగాను దానికి బలముంది కాబట్టే రాజ్యానికి మతానికి ఎలాంటి సంబంధం ఉండాలి, భారత రాజకీయాలలో మతం పాత్ర ఏ విధంగా ఉంది, రాజకీయాలలో మతానికి ప్రాధాన్యం పెంచేందుకు జరుగుతున్న ప్రయత్నాలను ఎలా చూడాలి వంటి ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇవన్నీ ప్రశ్నలు ఎందుకు అవుతున్నాయి అని అంటే కేవలం కొన్ని మూఢ నమ్మకాలు ఉన్నాయి కాబట్టి కాదు, దేవుళ్ళకు ఏవో కొన్ని మహిమలున్నాయని ప్రజలు నమ్ముతున్నారు కాబట్టి కాదు. అది కేవలం నమ్మకమైతే అది వేరే విషయంగా, ఒక రకంగా చిన్న విషయంగా ఉండేది. కాని అదొక సామాజిక వ్యవస్థలో భాగమయి పోయింది కాబట్టి, సామాజిక వ్యవస్థను నిలబెట్టే ఒక భావజాలం అయిపోయింది కాబట్టి,

ఒక ప్రాపంచిక దృక్పథం అయిపోయింది కాబట్టే ఇవ్వాళ మతమనేది భారత రాజకీయాలలో ఒక ప్రధానమైన విషయమైంది, ఒక ప్రధానమైనటువంటి చర్చ అయింది. భారతీయ జనతాపార్టీ వాళ్ళ లేదా విశ్వహిందూ పరిషత్ వాళ్ళ ఉపన్యాసాలు వింటే ఇది మనకు స్పష్టంగా అర్థమవుతుంది. వీళ్ళు రాజ్యాధికారానికి రావడానికి మతాన్ని వాడుకున్నారు. ఎట్లా వాడుకోగలిగారన్నది ఒక ప్రశ్న, వాడుకొని ఏమి చెయ్యదలచుకున్నారన్నది రెండవ ప్రశ్న.

ఈ పనిని వాళ్ళు ఎట్లా చేయగలిగారంటే ప్రజలలో విశ్వాసాలున్నాయి, నమ్మకాలున్నాయి, ఎన్నో తరాలుగా, శతాబ్దాలుగా వారు నమ్ముతూ వస్తున్న దేవుళ్ళున్నారు. రాముడు గానీ, కృష్ణుడు గానీ, శివుడు గానీ, విష్ణువు గానీ, స్థానికమైనటువంటి గ్రామదేవతలు గానీ వారి పట్ల ప్రజలలో బలమైన నమ్మకాలు ఉన్నాయి కాబట్టి మన దేవుళ్ళ గుడులను ఆ ముస్లింలు వచ్చి కూల్చేశారు చూడండి అని ఒక కోపం, ఒక ద్వేషం ప్రజలలో కలిగించగలిగారు. అది మనకు స్పష్టంగా అర్థమవుతూనే ఉంది, కనిపిస్తూనే ఉంది. వారిలో ఆ భావాన్ని రగిలించగలిగారు. ఇది మన దేశం, ఇక్కడ మన గుడిని మనం కాపాడుకోలేమా? మన గుడిని వాళ్ళు కూల్చేస్తే మనం తిరిగి కట్టుకోలేమా? ఇంత అన్యాయమా అని చెప్పి వాళ్ళు రెచ్చగొట్టగలిగారు.

దాంతో పాటు వాళ్ళు రాజ్యాధికారానికి వస్తూ ఏ రకమైన రాజ్యాన్ని నిర్మించదలచుకున్నారు, ఏ రకమైన రాజకీయ విలువలను ప్రతిపాదించదలుచుకున్నారు అనే ప్రశ్న కూడ వేసుకుంటే రాజకీయాలలో మతాన్ని మనం ఎందుకు వ్యతిరేకిస్తున్నాం, భారతీయ జనతాపార్టీ వాళ్ళ ఈ హిందుత్వ ప్రయోగమేదైతే ఉందో దానిని ఎందుకు వ్యతిరేకిస్తున్నామన్న ప్రశ్నకు మనకు జవాబు దొరుకుతుంది. ఏ రకమైన విలువలను ప్రతిపాదించదలచుకున్నారు వాళ్ళు? వాళ్ళు బహిరంగంగా చెబుతున్నారు భారతీయ సంప్రదాయమే దేశ రాజకీయ విలువలుగా ఉండాలి అని. జవహర్‌లాల్ నెహ్రూ, లేకపోతే ఈ సోషలిస్టులు, ఈ కమ్యూనిస్టులు, ఈ లౌకికవాదమని చెప్పేవాళ్ళు వీళ్ళందరూ భారత దేశంలోకి పాశ్చాత్య విలువలను తీసుకొస్తున్నారు. కాని దేశ రాజకీయాలు, దేశ సామాజిక వ్యవస్థ భారతీయ విలువలు, భారతీయ సంప్రదాయం ప్రకారం ఉండాలి అనేది వారి వాదన. ఏమిటి ఆ భారతీయ విలువలు? ఏమిటి ఆ భారతీయ సంప్రదాయం? దాని భావమేమి అని అడిగితే అద్వానీ ఇబ్బంది పడతాడు, వాజ్‌పేయి ఇబ్బంది పడతాడు.

ఎందుకంటే వాళ్ళకు తెలుసు ఓట్లు రావాలంటే కొన్ని మాటలు మాట్లాడకూడదు, జాగ్రత్తగా ఉండాలని.

ఓట్ల కోసం వచ్చే బి.జె.పి  నాయకులు కాని వాళ్ళు కొంతమంది ఉన్నారు, ఓట్ల కోసం రావాల్సిన అగత్యం లేనటువంటి విరాట్ హిందూ సమ్మేళనం, విశ్వహిందూ పరిషత్ నాయకులు కొంతమంది ఉన్నారు. వాళ్ళు బహిరంగంగానే ఢిల్లీలో ప్రెస్ కాన్ఫరెన్స్ లు పెట్టి పాకిస్తాన్ వాళ్ళు ఖురాన్ ప్రకారం రాజ్యాంగం రాసుకున్నట్టే మనం మనుధర్మశాస్త్రం ప్రకారం రాజ్యాంగం రాసుకుందాం అంటున్నారు. మనుధర్మశాస్త్రం ప్రకారమే భారతదేశ వ్యవస్థను, సమాజాన్ని తయారు చేసుకుందాం అంటున్నారు. ఇదంతా బహిరంగంగానే చెపుతున్నారు. అదే భారతీయ సంప్రదాయం, అవే భారతీయ విలువలు అని చెపుతున్నారు. అవి ఏమని చెపుతున్నాయి, మనుధర్మశాస్త్రం ఏం చెపుతున్నది, మనుషులను భగవంతుడే, సాక్షాత్తూ శ్రీమన్నారాయణుడే నేనే మనుషులను అసమానంగా సృష్టించానని, భగవద్గీతలో స్పష్టంగా చెప్పాడు అని.

## దేవుడే సృష్టించాడట ఈ అసమానతలన్నీ...

ఇదేదో పొరపాటుగా జరిగిందని మీరెవరూ అనుకోవద్దు, నేనే మనుషులను అసమానంగా సృష్టించాను, గుణ కర్మలను బట్టి మీకు మీ ధర్మాలను నేనే కేటాయించాను, నువ్వు ఆడదానివి నువ్వు వంట చేసుకో, నువ్వు మాల వాడివి నువ్వు ఈ పని చెయ్యి, నువ్వు మాదిగ వాడివి నువ్వు చెప్పులు కుట్టుకో, నువ్వు బ్రాహ్మణుడువి నువ్వు పౌరోహిత్యం చేసుకో అని నేనే కేటాయించాను. నేను కేటాయించిన ధర్మాలు ఒకవేళ అసంతృప్తిగా అనిపించినా పర ధర్మం కోసం మీరు ఆశపడటం వినాశ హేతువు అని ఆయన చెప్పి ఉన్నాడు. పర ధర్మం కోసం మీరు ఆశపడవద్దు అనంటే ఏమిటన్న మాట? నువ్వు మాదిగ వాడివి కాబట్టి ప్రధానమంత్రిని అవుతాను అనుకోవద్దు, ప్రొఫెసర్ ను అవుతాను అనుకోవద్దు. అలాగే నువ్వు ఆడదానివి, నేను బయటకు వచ్చి ఉద్యోగం చేస్తానని అనుకోవద్దు, నువ్వు వంట మాత్రమే చెయ్యాలని నేనే చెప్పాను. దీనిని మీరు ఆచరిస్తూ ఉంటే రాబోయే జన్మలో ఇంతకంటే మెరుగైన జన్మ రావచ్చు. ఇప్పుడు ఎట్లయితే క్రైస్తవం గురించి ఆయన చెప్పాడో అలాంటిదే. ఇక్కడ మీకు పేదరికం ఉందని మీరేమీ బాధపడొద్దు, పరలోకం అంతా మీదే అన్నారు గదా అట్లా భవిష్యత్ జన్మలు మీవే. ఈ జన్మలో మాత్రం మీరు పర ధర్మం కోసం ఆశపడొద్దు, ఎంత అయిష్టంగా అనిపించినా స్వధర్మాన్ని

ద్వేషించవద్దు. ఎందుకు నీకు ఈ ధర్మం వచ్చింది? పూర్వంలో పాపం చేశావు కాబట్టి నీకు ఈ ధర్మం వచ్చిందని భారతీయ సంప్రదాయం చెపుతుంది.

ఇది ఈ రోజు మనం ఎందుకు చెప్పుకోవాల్సి వస్తున్నదంటే భారతీయ సంప్రదాయాన్ని విమర్శించడం కోసమో, ద్వేషించడం కోసమో మాత్రమే కాదు – ఈ వాదనను రాబోయే రోజులలో సామాజిక వ్యవస్థను తీర్చిదిద్దడానికి, రాజకీయాలను తీర్చిదిద్దడానికి, భారతీయ సమాజాన్ని నిర్మించడానికి ప్రధానమైన విలువగా ప్రతిపాదిస్తున్నారు కాబట్టి; భారతీయ జనతాపార్టీ వాళ్ళుగానీ, విశ్వహిందూ పరిషత్ వాళ్ళుగానీ భారతీయ సంప్రదాయం అనే పేరు మీద ఓట్లు సంపాదించుకొని అధికారానికి రాబోతున్నారు కాబట్టి. అంటే ఈ మతమనేది కేవలం రాముడి మీద భక్తి, శివుడి మీద భక్తి అనే స్థాయి దగ్గర ఆగిపోలేదు, అది సమాజ నిర్మాణంలో ఒక విలువ కాబోతోంది, దానిని సమాజ నిర్మాణానికి ప్రాతిపదిక చేయాలనే ప్రయత్నం చేస్తూ ఉన్నారు. చాలాకాలంగా ఇది జరుగుతూనే ఉన్నా అధికారికంగా మాత్రం లేదు లేదు అంటూ వచ్చారు. అధికారికంగా కూడ చెప్పి చేస్తామనే పార్టీ ఇవ్వాళ ఎన్నికలలో నిలబడి ఓట్లు సంపాదించుకుంటోంది.

ఇప్పుడేమయ్యింది? మతం అనేది కేవలం మూఢ విశ్వాసం కాకుండా పోయింది. సమాజ నిర్మాణం అయిపోయింది. సామాజిక వ్యవస్థ అయిపోయింది. సామాజిక వ్యవస్థను హిందూత్వం అనే ప్రాతిపదిక మీద నిర్మాణం చెయ్యడం మొదలుపెడితే మన భవిష్యత్ ఏమవుతుంది, మన పిల్లల భవిష్యత్ ఏమవుతుంది? ఇన్నేళ్ళుగా పోరాటాలు చేసి, ఉద్యమాలు చేసి, ఘర్షణ పడి మేమూ చదువుకుంటాం, మేమూ ఉద్యోగాలు చేస్తాం, మాకూ సమానత్వం కావాలి, మీకే మాత్రం ఆస్తులున్నాయో మాకూ ఆ మాత్రం ఆస్తులు కావాలి అని ఏ ఆకాంక్షలతో అయితే దళితులు గానీ, స్త్రీలు గానీ, పీడితులు గానీ ముందుకు వచ్చారో ఆ ఆకాంక్షలు ఏమయిపోవాలి భవిష్యత్‌లో అనే ప్రశ్న మన ముందుకు వస్తుంది.

అందుకే పి.వి. నరసింహారావు నేను బి.జె.పి మీద పోరాటం చెయ్యగలను గానీ రాముడి మీద పోరాటం చెయ్యలేను అని అంటున్నాడు; ఎన్నికలలో బి.జె.పి మీద నేను పోటీ చేస్తే చేస్తాను గానీ హిందుత్వం మీద నేను పోరాటం చెయ్యలేను అంటున్నాడు. అంటే ఏమిటి? కాంగ్రెస్ పార్టీ కూడ ఈ హిందుత్వ విలువల ప్రతిపాదనను ప్రతిఘటించలేకుండా ఉంది, వ్యతిరేకించలేకుండా ఉంది. వ్యతిరేకించడం ఇష్టం లేదు

కూడ వాళ్ళకు. భారతీయ జనతా పార్టీ వాళ్ళు మీటింగ్‌లో కూర్చొని మా కంటే పి.వియే బాగా మాట్లాడుతున్నాడు అని అనుకుంటున్నారు అంటే ఇవ్వాళ దేశాన్ని పరిపాలించే వాళ్ళ మానసిక విలువలు, రాజకీయ విలువలు, వాళ్ళ ఆలోచనలు, వాళ్ళ విధానాలు భారత దేశాన్ని ఏం చేయబోతున్నాయని అనుకోవాలి? మన పిల్లల భవిష్యత్ ఏ రకంగా ఉండబోతోంది అనేది అప్పుడు మతం దగ్గర ఆగకుండా ఒక రాజకీయ సమస్యగా, సామాజిక సమస్యగా మన ముందుకు వచ్చి నిలబడుతుంది.

## రంగనాథ్ మిశ్రా నోట కూడ అదే మాట

రంగనాథ్ మిశ్రా ఒకప్పుడు మన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉండేవారు. రిటైరయిన తరువాత ఆయనను ఇప్పుడు పి.వి. నరసింహారావు భారత జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఛైర్మన్‌గా నియమించాడు. ఈయన ఇప్పుడు మానవ హక్కుల కేసులు టేకప్ చెయ్యాలి, విచారణ జరపాలి, రిపోర్టులు ఇవ్వాలి, ప్రభుత్వానికి సలహాలు ఇవ్వాలి. ఆయన దృక్పథం ఏమిటి? ఆయన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉండగానే ఢిల్లీలో ఒక మహిళా సంఘం మీటింగ్‌లో మాట్లాడాడు. ఆ మహిళా సంఘం కూడ ఒక ఆధ్యాత్మిక మహిళా సంఘమే, బ్రహ్మకుమారి సమాజం లాంటిదేదో అది. అయినప్పటికి మహిళాసంఘమే కాబట్టి వాళ్ళకు ఎక్కడ స్వేచ్ఛ కావాలనే కోరిక ఉంటుందో అని ఆయనకు భయం పుట్టింది. అందరూ ఆడవాళ్ళు కూర్చున్నారంటే ఆడవాళ్ళుగా ఆలోచిస్తారేమో వాళ్ళు, మాకు హక్కులు కావాలి, స్వతంత్రం కావాలి అంటారేమో అని ఆయనకు అనుమానం వచ్చి ఆయన ఉపన్యాసంలో ఏమన్నాడంటే భగవంతుడే మనలను అసమానంగా సృష్టించినప్పుడు మనమెవ్వరం సమానత్వం కోరుకోవడానికి? హక్కులు కాదు, మీకు కేటాయించబడ్డ డ్యూటీలను మీరు సక్రమంగా చేయండి అన్నాడు.

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఆయన ఎన్ని తీర్పులు ఇచ్చాడో, అంతకుముందు హైకోర్టులో న్యాయమూర్తిగా ఎన్ని తీర్పులు ఇచ్చాడో – ఈ దృక్పథం పెట్టుకునే ఆ తీర్పులు ఇచ్చాడు ఆయన. ఇది భారత రాజ్యాంగానికి పూర్తిగా విరుద్ధమైనటువంటి దృక్పథం. భారత రాజ్యాంగంలో ఉన్నటువంటి ప్రాథమిక హక్కులకు, ఆదేశిక సూత్రాలకు పూర్తిగా విరుద్ధమైన దృక్పథం. మహిళా సంఘాల వాళ్ళు గొడవ చేస్తే ఆయన నేను నోరు జారి అన్నాననో, నేను ఒక రకంగా మాట్లాడితే పత్రికల వాళ్ళు ఇంకొక రకంగా రాశారనో ఏదో చెప్పి తప్పించుకొనే ప్రయత్నం చేశాడు. ఆయన

ఇవ్వాళ జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు చైర్మన్. ఈ మాట ఎందుకు చెపుతున్నానంటే మతం, ముఖ్యంగా హిందుత్వం, భారత దేశంలో మెజారిటీ మతం ఇదే కాబట్టి మనం ప్రధానంగా దీని గురించే బాధపడాలి.

చాలామంది అంటూ ఉంటారు మీరెందుకు ముస్లింలను విమర్శించరు, ఎందుకు క్రైస్తవులను విమర్శించరు అని. ప్రజాస్వామికవాదులు అన్ని మతోన్మాదాలను వ్యతిరేకిస్తారు గానీ భారతదేశంలో బతుకుతూ ఉన్నప్పుడు ఇక్కడ ప్రధానమైన మతం హిందూ మతమే కాబట్టి, ఇక్కడ రాజ్యాధికారానికి రావడానికి గాని, సమాజాన్ని శాసించడానికి గాని క్రైస్తవానికి అవకాశం లేదు, ఇస్లాంకి అవకాశం లేదు, హిందుత్వమే ఆ పని చేయగలుగుతుంది కాబట్టి ప్రత్యేకించి పేరుపెట్టే దాని గురించి మాట్లాడాల్సిన అవసరం ఉంటుంది.

## రాజ్యంగ యంత్రాంగం అంతటిలోనూ అదే దృక్పథం

హిందుత్వం మన సామాజిక వ్యవస్థ మీద, రాజకీయాల మీద ఆధిపత్యాన్ని నెలకొల్పగలుగుతూ ఉందని మనం భావిస్తున్నపుడు, దాని వల్ల రాగల ప్రమాదం గురించి ఆలోచిస్తున్నపుడు మన విమర్శను కేవలం బి.జె.పి కే పరిమితం చేస్తే సరిపోదు. రాజ్యం కుండే అన్ని అంగాలు, అన్ని భాగాలు కూడ ఈ హిందుత్వ సంప్రదాయం, భారతీయ సంస్కృతి, భారతీయ సంప్రదాయం అనే వాటి చేత బలంగా ప్రభావితమవుతున్నాయి. మొత్తంగా అల్లుకుపోతున్నది ఈ భారతీయ అనే దృక్పథం.

భారత నాస్తిక సమాజం హైకోర్టులో మొన్న ఒక రిట్ పిటిషన్ వేసిందని జయగోపాల్ గారు చెప్పారు. ప్రభుత్వ ఆఫీసుల్లో దేవుళ్ళ ఫోటోలు పెట్టడం, ఆర్టీసి డిపోలలో దేవుళ్ళ ఫోటోలు పెట్టడం, ప్రభుత్వ కార్యక్రమాలు ప్రారంభించేటప్పుడు కొబ్బరికాయలు కొట్టడం, బ్రాహ్మణులను పిలిపించడం, వైదికమంత్రాలను చదివించడం, ఇవన్నీ చేయకూడదు, సెక్యులర్ అయిన రాజ్యాంగానికి అది విరుద్ధం అని వాళ్ళు రిట్ వేస్తే అడ్మిషన్ దశలోనే హైకోర్టు దానిని కొట్టేసింది. ఎందుకు కొట్టేసింది? ఆ జడ్జీల మైండ్‌లో ఏముంది? ప్రభుత్వం తప్పు చేస్తోంది, పి.వి. నరసింహారావు తప్పు చేస్తున్నాడు అని నువ్వు కోర్టుకు పోతే, అట్లాంటి జడ్జీలే కూర్చున్నారక్కడ, వాళ్ళ మైండ్‌లోనూ అదే ఉంది. ఆ జడ్జీ గారు పొద్దున లేచి పూజలు చెయ్యాల్సిందే, ఇంటికి పోయి రాత్రి మళ్ళీ పూజలు చేయాల్సిందే, భగవద్గీత పారాయణం చేయాల్సిందే, ఇవన్నీ చేస్తేనే నేను జడ్జీగా ఉండగలుగుతానని ఆయన అనుకుంటున్నాడు, మరి ఆయన దగ్గర మనం పిటిషన్ వేసి ప్రభుత్వ యంత్రాంగం

మతాన్ని దూరంగా ఉంచాలి, దేవుళ్ళ ఫోటోలు పెట్టకూడదు, పూజలు జరిపించకూడదు అంటే ఆయన అడ్మిట్ ఎందుకు చేసుకుంటాడు, కేసు ఎందుకు వింటాడు!

పుట్టపర్తి సాయిబాబా షష్టిపూర్తికి మన రాష్ట్ర హైకోర్టు నుంచి ఆరుగురు జడ్జీలు పోయారు. మా కన్నాబిరాన్ గారికి కోపమొచ్చి బార్ అసోసియేషన్‌కు ఒక లెటర్ ఇచ్చారు, ప్రతి సంవత్సరం పుట్టపర్తి సాయిబాబా పుట్టినరోజును కోర్టుకు సెలవుదినంగా ప్రకటించండి అని. వీళ్ళందరూ ఇలా పోతూ ఉంటే మేమెందుకు అనవసరంగా గౌన్లేసుకుని, కోటులేసుకుని రావాలి కోర్టుకు, మా టైమ్ వేస్టు అని రాశాడాయన. వాళ్ళు ఏమీ చెయ్యలేక ఆ లేఖను నోటీసు బోర్డులో ప్రదర్శించారు. జడ్జీల మెదళ్ళు అలా ఉన్నాయి. వాళ్ళు అక్కడకు పోయి ఏం చేశారు? సాయిబాబా సింహాసనం మీద కూర్చుంటే వీళ్ళంతా ఎలక పిల్లల మాదిరిగా ఆయన కాళ్ళ దగ్గర కూర్చున్నారంట. మన ఐలయ్యగారు చెపుతుంటారు ఎప్పుడూ – వినాయకుడి దగ్గరి ఎలక పిల్లల మాదిరి పుట్టపర్తి సాయిబాబా కాళ్ళ దగ్గర పి.వి. నరసింహారావు ఇక్కడ, శంకర్ దయాళ్ శర్మ అక్కడ, సుప్రీంకోర్టు జడ్జీలిక్కడ, హైకోర్టు జడ్జీలక్కడ కూర్చుంటారు అని. ఇందులో బి.జె.పి ఎక్కడుంది అని అడగొచ్చు. ఇక్కడ బి.జె.పి లేదు. బి.జె.పి అనేది చాలా స్పష్టంగా ముందుకు వస్తున్నటువంటి ఒక హిందుత్వ రాజకీయ శక్తి మాత్రమే.

హిందుత్వ ప్రాపంచిక దృక్పథం, భావజాలమనేది ఇవ్వాళ మొత్తంగా పాలక వర్గం అంతటా అల్లుకుపోయింది. ఎందుకు జరుగుతోంది ఇది? దీని ఫలితం ఏ రకంగా ఉండబోతుంది? మతాన్ని రాజకీయాల నుంచి వేరు చేయడం, మతాన్ని సమాజం నుంచి దూరం చేయడం, మతానికి సమాజం మీద, రాజకీయాల మీద ప్రభావం లేకుండా చేయడం అంటే కేవలం మత సూక్తులను, మత సూత్రాలను విమర్శిస్తే సరిపోదు, విమర్శించాల్సిందే, కాని అది సరిపోదు, అది ఒక రాజకీయ పోరాటం, ఒక రాజకీయ సంఘర్షణ అవుతుందనే విషయం దీని నుంచే మనకు క్రమక్రమంగా అర్థం కావడం ప్రారంభమవుతుంది.

బాబ్రీ మసీదును వీళ్ళు అయోధ్యలో కూల్చేసిన తరువాత దేశంలో చాలా చోట్ల ముస్లింలకు కోపం వచ్చింది. వాళ్ళు కాంగ్రెస్ పార్టీని నమ్ముకున్నారు. కాంగ్రెస్ పార్టీ తమ మసీదుని కాపాడుతుందని అనుకున్నారు. కాని అది కాపాడలేదు, కనీసం కాపాడే ప్రయత్నం కూడ చెయ్యలేదు. ఆ రోజు అక్కడ ఉన్నటువంటి సిఆర్‌పిఎఫ్ గానీ, బిఎస్ఎఫ్

గానీ మసీదును కూల్చివేస్తూ ఉంటే చూస్తూ ఉన్నారంతే. ఎందుకు చూస్తూ ఊరుకున్నారు అంటే మాకు ఏం చెయ్యాలో instructions లేవు కాబట్టి అన్నారు. వాళ్ళను ఊరికే బొమ్మల మాదిరిగా అక్కడ నిలబెట్టారు అంతే. ఆదేశాలు ఎవరు ఇవ్వాలి? స్టేట్ గవర్నమెంట్ ఇవ్వాలి. స్టేట్ గవర్నమెంట్ ఎవరు? కళ్యాణ సింగ్. బి.జె.పి ముఖ్యమంత్రి. రాష్ట్ర ప్రభుత్వం కళ్యాణ్‌సింగ్ చేతిలో ఉందని పి.వి.నరసింహారావుకు తెలుసు. కేంద్ర బలగాలకు ఆయన ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదు. కాబట్టి వాళ్ళు చూస్తూ ఉన్నారు, వీళ్ళు కూల్చేస్తూ ఉన్నారు. ముస్లింలకు కోపం వచ్చింది, ఊరేగింపులు తీశారు. కొన్ని చోట్ల హింసకు పాల్పడ్డారు గానీ చాలావరకు ప్రశాంతంగానే తమ కోపాన్ని వ్యక్తపరిచారు.

మసీదుని కాపాడలేనప్పుడు పోలీసులు మాకేమీ Instructions లేవు అన్నారు గానీ ఇప్పుడు Instructions ఉన్నాయో లేవో తెలియదు గానీ వాళ్ళ మీద మాత్రం విరుచుకుపడ్డారు. వాళ్ళను కొట్టారు, తన్నారు, కాల్పులు జరిపారు. పౌరహక్కుల సంఘంగా హైదరాబాద్‌లో మేము తిరిగాము పోలీసు కాల్పులు జరిగిన గల్లీల్లో. ఎంత కోపం వచ్చినా వాళ్ళు ఒకే ఒక్క చిన్న మైసమ్మ గుడిని తగలబెట్టారు అంతే. అంతకంటే వాళ్ళు హింస ఏమీ చెయ్యలేదు. అయినా CRPF వాళ్ళు, BSF వాళ్ళు హైదరాబాద్‌లో కర్ఫ్యూ పెట్టి, కవాతు చేసి గల్లీలలోకి తుపాకులు పెట్టి కాల్పులు జరిపారు. హైదరాబాద్ పాతబస్తీలో ఇళ్ళు ఇరుకిరుకుగా ఉంటాయి. కర్ఫ్యూ పెట్టినా, ఏమి పెట్టినా ఇంట్లో అందరూ ఉండాలంటే సాధ్యం కాదు. కర్ఫ్యూ ఉన్నా పిల్లలు మెయిన్ రోడ్డు వదిలిపెట్టి సందులలోకి వచ్చి ఆడుకుంటూ ఉంటారు, పెద్దవాళ్ళు బయటకొచ్చి కూర్చుని మాట్లాడుకుంటూ ఉంటారు. ఎప్పుడూ ఉండే విషయమే అది. అట్లాంటి సందులలోకి తుపాకులతో కాల్పులు జరిపి చిన్నపిల్లలని, ముసలివాళ్ళని కూడ చూడకుండా కాల్చి చంపారు.

ముస్లింలు ఈ రకంగా వచ్చి బయటకొచ్చి కొంత గొడవ చేశారని బొంబాయిలో శివసేన వాళ్ళు ఏం చేశారు? ముస్లింలపైన చాలా దారుణంగా దాడులు చేసి, ఊచకోత కోసి, ఇళ్ళలోకి తోసి, ఇంటి బయట గొళ్ళెంపెట్టి నిప్పు పెట్టి తగలబెట్టారు. ఇంట్లో నుంచి బయటకు పరిగెత్తి ప్రాణాన్ని కాపాడుకొనే అవకాశం కూడ లేకుండా వాళ్ళను సజీవంగా దహనం చేశారు. బొంబాయిలో, మహారాష్ట్ర అంతటా కూడ పోలీసులు శివసేనకు దీంట్లో పూర్తిగా సహకరించారు. నేను ఈ వివరాలు ఎందుకు చెప్తున్నానంటే శివసేన దుర్మార్గంతోపాటు అధికార యంత్రాంగం సహకారం ఎంత ఉందో కూడ చూడండి. బి.జె.పి, విశ్వహిందూ పరిషత్, శివసేనను మాత్రమే చూసి సమాజంలో వీళ్ళ బలం

5 శాతమే ఉంది, 10 శాతమే ఉంది, ఫరవాలేదులే అనుకోకుండా ఉండేందుకు. దేశాన్ని పరిపాలించే అధికార యంత్రాంగం, కోర్టులు, అసెంబ్లీలు, పార్లమెంటు, ప్రభుత్వాలు, ఐఎఎస్ ఆఫీసర్లు ఎట్లా తయారవుతున్నారో చూడండి, హిందుత్వం అనేది వాళ్ళ మెదళ్ళలోకి ఏదో సిరంజి పెట్టి ఎక్కించినట్టు ఎలా ఎక్కుతోందో చూడండి. వాళ్ళు సమాజాన్ని హిందుత్వ దృష్టితోనే చూస్తున్నారు, ఆ దృష్టితోనే డ్యూటీ చేస్తున్నారు అనేది గమనించండి అని చెప్పడానికే ఈ విషయాలు చెపుతున్నాను.

బొంబాయిలో ఈ దాడులు జరిగినప్పుడు ముస్లింలు భయపడి పరిగెత్తి పోయారు. ఎక్కడ తలదాచుకోవాలి? ప్రజలను కాపాడవలసింది పోలీసులే కదా. అక్కడికే పరిగెత్తారు వాళ్ళు. పోలీసుస్టేషన్ కాంపౌండ్‌లోకి వాళ్ళు పరిగెత్తి వస్తుంటే ముస్లింలు పోలీసుస్టేషన్‌పైన దాడి చేయడానికి వస్తున్నారని పోలీసులు వారిపై తుపాకులు ఎక్కుపెట్టారు. లేదు, లేదని వాళ్ళు చేతులెత్తి దణ్ణం పెడుతూ లోపలికి వచ్చారు. పోలీసులు వాళ్ళల్లో వాళ్ళు వైర్‌లెస్ సెట్‌లో మాట్లాడుకుంటుంటారు. ఎవరూ వింటున్నారు అనుకోరు కాబట్టి ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతూ ఉంటారు, మేము కూడ చాలాసార్లు వింటుంటాం పోలీసుస్టేషన్‌కు పోయినప్పుడు. అటువంటి ఒక సంభాషణ పౌరహక్కుల వాళ్ళ చెవిన బడింది.

ఒక కింది ఆఫీసర్ పై ఆఫీసర్‌కు "సార్ మా ఏరియాలో దాడులు జరుగుతున్నాయి" అని చెపితే, దానికి ఆ పై ఆఫీసర్ "ఎవరు ఎవరి మీద చేస్తున్నారు, ముస్లింలు హిందువుల మీద చేస్తూ ఉంటే వెంటనే బయలుదేరి పోండి, హిందువులు ముస్లింల మీద చేస్తే ఏం పర్వాలేదు, మీరు పోనక్కరలేదు" అని చెప్పడం వారు విన్నారు. బొంబాయిలో వైర్‌లెస్ సెట్‌లలో వచ్చే మెసేజ్‌లన్నీ రికార్డు అవుతాయి. CPDR అనే పౌరహక్కుల సంఘం వాళ్ళు ముస్లింల మీద దాడులు జరుగుతున్నాయని చెప్పడం కోసం ఆ పోలీసుస్టేషన్‌కు పోతే వైర్‌లెస్ సెట్‌లో ఇది వస్తూ ఉంది. వాళ్ళు అది విని బొంబాయి హైకోర్టులో పిటిషన్ వేశారు. బొంబాయి హైకోర్టు ఆ మొత్తం టేప్ తెప్పించుకుంది. ఇప్పుడు ఆ కేసు నడుస్తుంది బొంబాయి హైకోర్టులో. ముస్లింలపైన దాడులు జరిగితే మీరేమీ పట్టించుకోనక్కర్లేదని ఎవరు చెపుతున్నారు? ఒక ACP ఒక DCP కి చెపుతున్నాడు. పోలీసుస్టేషన్‌లో తలదాచుకున్న ముస్లింలు రెండుమూడు గంటల తరవాత దప్పికవుతుంది మంచినీళ్ళు కావాలని ఎస్.ఐని అడిగితే, ఇప్పటికి మీకు ఇచ్చింది చాలు, ఇంకేమైనా కావాలంటే పాకిస్తాన్‌కు పోండి అన్నాడటంట. అంటే ఇండియాలో ఇప్పటికి మీకు ఇచ్చింది

చాలు, మీకు హక్కులు ఇచ్చాం, మీకు స్వేచ్ఛ ఇచ్చాం, మైనారిటీ గుర్తింపు ఇచ్చాం, ఇంకేమన్నా కావాలంటే పాకిస్తాన్‌కు పోండి అని దాని అర్థం. బిల్డింగ్‌లు కావాలని అడిగితే కాదు, మంచి నీళ్ళు కావాలని అడిగితే ఈ మాట అన్నాడాయన. అంతే కాదు, ఏదో ఈ యూనిఫారమ్ వేసుకున్నాం కాబట్టి ఇట్లున్నాం గానీ మనసులో మేమంతా శివసేన వాళ్ళమే అంటారంట వాళ్ళు. మనసులో మేమందరం శివసేన వాళ్ళమే గానీ ఏదో ఉద్యోగం చెయ్యాలి కాబట్టి పోలీసు ఉద్యోగం చేస్తున్నాము, మిమ్మల్ని కాపాడాలంటే మేమేమి కాపాడతాం అంటారంట.

జస్టిస్ కృష్ణయ్యర్ నెలకొల్పినటువంటి ఇండియన్ పీపుల్స్ రైట్స్ ట్రిబ్యునల్ అని ఒక సంస్థ ఉంది. రిటైరైన హైకోర్టు, సుప్రీంకోర్టు జడ్జీలతో ఆయన దానిని నెలకొల్పాడు. పెద్ద పెద్ద అత్యాచారాలేవైనా జరిగినప్పుడు ప్రభుత్వం న్యాయ విచారణ జరిపించడానికి నిరాకరిస్తే కృష్ణయ్యర్‌గారు ఒక అనఫిషియల్ జుడిషియల్ ఎంక్వయిరీ జరుపుతూ ఉంటారు. బొంబాయి హైకోర్టులోనే రిటైరయిన ఇద్దరు జడ్జీలతో జస్టిస్ సురేష్ అనీ, జస్టిస్ దావూద్ అనీ వాళ్ళతో బొంబాయి ఘటనల మీద ఒక ఎంక్వయిరీ జరిపారు. వాళ్ళు ఒక రిపోర్టు విడుదల చేశారు. ఆ రిపోర్టులో ముస్లింల పైన శివసేన వాళ్ళు పాల్పడిన అత్యాచారాలకు బహిరంగంగా సహకరించిన పోలీసు ఆఫీసర్లుగా 82 మంది పోలీసుల పేర్లు ఇచ్చారు. దాంట్లో పోలీసు కానిస్టేబుళ్ళ దగ్గర నుంచి అడిషనల్ పోలీసు కమిషనర్ దాకా ఉన్నారు. కింది వాళ్ళు మాత్రమే దుర్మార్గులు, పై వాళ్ళు మంచివాళ్ళు అనుకుంటూ ఉంటారు చాలామంది. పోలీసు కానిస్టేబుళ్ళ దగ్గర నుంచి బొంబాయి నగర అడిషనల్ పోలీసు కమిషనర్ దాకా అందరి పేర్లూ ఆ లిస్టులో ఉన్నాయి.

ఇవన్నీ ఎందుకోసం చెపుతున్నానంటే ఇవ్వాళ మతం అనేది ఒక విశ్వాసం మాత్రమే కాదు, ఒక నమ్మకం మాత్రమే కాదు. భారతీయ సంప్రదాయంలో, హైందవ సంప్రదాయంలో కులవ్యవస్థ, వర్ణధర్మం, వర్ణవ్యవస్థ సామాజిక సంబంధంగానే ఉంది. Hinduism is a way of life, not a religion అని గర్వంగా చెపుతుంటారు. గర్వంగా కాదు, సిగ్గుపడుతూ చెప్పవలసిన విషయం అది. ఇక్కడ way of life అంటే ఏమిటి? వర్ణధర్మం, వర్ణవ్యవస్థ, వర్ణవివక్ష, వర్ణ ఆధిపత్యం, కులాధిపత్యం ఇవే ఆ way of life. అదే మన సమాజంలో ఉంది.

## కులాధిక్యాన్ని వ్యతిరేకించడమే ఇక్కడ లౌకికవాదం

భారతదేశంలో లౌకికవాదం అంటే కులాన్ని వ్యతిరేకించడం; లౌకికవాదాన్ని కాపాడుకోవడమంటే వర్ణధర్మాన్ని, వర్ణవ్యవస్థను, కులవ్యవస్థను, కుల ఆధిక్యతను వ్యతిరేకించడం. అదీ లౌకికవాదాన్ని కాపాడుకోవడమంటే, లౌకికవాదాన్ని నిలబెట్టుకోవడమంటే. ఇవ్వాళ ఆ భారతీయ సంప్రదాయం భారతీయత అనే పేరు మీద బహిరంగంగా ముందుకు వచ్చింది. ఒక్క భారతీయ జనతా పార్టీ, విశ్వహిందూ పరిషత్ వాళ్ళు మాత్రమే కాదు, మొత్తంగా దేశంలో అధికారంలో ఉండేవాళ్ళు, ఆధిపత్యంలో ఉండే వాళ్ళందరూ కూడ తమ అధికారాన్ని, తమ ఆధిపత్యాన్ని, తమ సంపదను, తమ పెత్తనాన్ని నిలబెట్టుకోవడానికి ఇవ్వాళ అది తప్ప వేరే మార్గమేమీ లేదని భావిస్తున్నారు. ఎందుకంటే ఒక్క భారతీయ వర్ణధర్మం మాత్రమే సమాజంలో ఎవరికి కేటాయించిన స్థానంలో వాళ్ళను సంతృప్తిగా పడి ఉండమని చెపుతుంది. ఇంతకంటే మెరుగైన జీవితం కోరుకోవద్దు, హక్కులు కోరుకోవద్దు అని చెప్పే ధర్మం అదే కాబట్టి మన ఆధిపత్యాన్ని, మన సంపదను, మన అధికారాన్ని, మన పెత్తనాన్ని కాపాడుకోవడానికి భారతీయ సంప్రదాయమే సరయినది అని చెప్పి ఇవ్వాళ అనుకుంటున్నారు. అందువల్ల ఇవ్వాళ మతానికి రాజ్యానికి మధ్య ఉండే సంబంధం గురించి మాట్లాడుతున్నామంటే భారత సామాజిక వ్యవస్థలోను, భారత రాజకీయ వ్యవస్థలోను మతం నిర్వహిస్తున్న పాత్ర, హైందవ మతం పేరు మీద వర్ణధర్మం నిర్వహిస్తున్న పాత్ర, దానిని గుర్తించడం, దానిపట్ల అప్రమత్తంగా ఉండటం, దానిని వ్యతిరేకించడం అందులో చాలా ముఖ్యమైన అంశం అవుతుంది. కేవలం మూఢనమ్మకాలను విశ్వసించడం మాత్రమే మతం కాదు.

మూఢనమ్మకాలు దానికి అనుసంధానమై ఉంటాయి. మూఢనమ్మకాల లింక్ ఎక్కడినుంచి వస్తుందంటే ఇవ్వాళ మీరు దేశంలో చాలా ప్రాంతాలలో గమనించగలుగుతారు. ప్రజలకు ఏదో దేవుడి మీద నమ్మకం ఉంటుంది. రకరకాల దేవతలను పూజిస్తూ ఉంటారు. పోచమ్మ అనీ, నూకాలమ్మ అనీ, గంగమ్మ అనీ రకరకాల దేవతలను స్థానికంగా పూజిస్తూ ఉంటారు. ఈ స్థానికమైన పూజలను బ్రాహ్మణులు గతంలో ఏం చేశారంటే మీ గంగమ్మ ఎవరో కాదు మా శివుడి భార్య పార్వతే, మీ నూకాలమ్మ ఎవరో కాదు మా దుర్గే అని ఇట్లా బ్రాహ్మణ దేవుళ్ళ భార్యలుగా ప్రజల దేవతలను లింక్ చేసి పెట్టారు. వాళ్ళు ఎప్పుడూ చేసేదే ఇది. ఇప్పుడు ఇవి దేనికి పనికొస్తున్నాయి అంటే ప్రజలు పూజించుకునే ఆ చిన్నచిన్న దేవతలందరికి కూడ బ్రాహ్మణ దేవుళ్ళ పక్కనే, ఆ ఆలయాల లోపలే

వాళ్ళకు గుడులు కట్టి ఆ దేవుళ్ళను, తద్వారా ప్రజలను, వాళ్ళ విశ్వాసాలను ఆధిపత్య మతంలోకి తీసుకువచ్చారు. ఇది దేనికి పనికొస్తుంది అంటే ఆధిపత్యాన్ని, పెత్తనాన్ని నిలబెట్టే భావజాలాన్ని మరింత పదిలపరచుకోవడానికి పనికొస్తుంది.

## రాముడ్నే ఎందుకు ఎంచుకున్నారు?

రాముడు ఎవరికి దేవుడు? దక్షిణ భారతదేశంలో రాముడ్ని పెద్ద దేవుడిగా మనం పూజలు ఏమీ చేయం. వెంకటేశ్వరుడు, సత్యనారాయణస్వామి వీళ్ళు పెద్ద దేవుళ్ళు ఇక్కడ. ఉత్తర భారతదేశంలో రాముడు చాలా ప్రధానమైన దేవుడు. వీళ్ళు అయోధ్యలోని ఆ ఒక్క గుడినే ఎందుకు పట్టుకున్నారు అని అంటే రాజకీయంగా పనికొస్తుంది కాబట్టి. రాజకీయంగా ఎందుకు పనికొస్తుంది? రాముడి మీద అక్కడ విస్తృతమైన విశ్వాసం ఉంది కాబట్టి. మామూలుగా ఇద్దరు ఉత్తర భారతీయులు రోడ్లో కలుసుకుంటే, మాట్లాడుకొని వెళ్ళిపోయేటప్పుడు పోయొస్తాను అనే అర్థంలో జైరామ్‌జీకి అంటారు. రోడ్‌లో పోతూ పోతూ మనం నమస్తే అంటాం గదా, అలాగే వాళ్ళు జైరామ్‌జీకి అంటారు. రాముడికి జయమగుగాక అనేది అక్కడి మనుషుల మధ్య ఒక పలకరింపుగా ఉంది. అంత బలమైన దేవుడు రాముడు. అంత నమ్మకం ఉంది వారికి ఆ దేవుడి మీద. ప్రజలలో ఉన్న నమ్మకం దేనికి పనికి వస్తుంది, నీ రాజ్యాధికారాన్ని పదిలపరచుకోవడానికి పనికొస్తుంది. ఎట్లా పనికొస్తుంది? రాముడి గుడిని వీళ్ళు కూల్చేశారు అని చెప్పడానికి, దాని మీద ఉద్యమం చెయ్యడానికి, ఉన్మాదం రెచ్చగొట్టడానికి అది పనికొస్తుంది.

ముస్లిం నవాబులు, సుల్తాన్లు దాడులు చేసినప్పుడు ఎన్నో గుడులను కూల్చేసి మసీదులను కట్టారు. మన వాళ్ళు కూడ ఆ ఘనకార్యాలు చాలా చేశారు. ఆ రోజులలో లౌకికవాదం, మైనారిటీల హక్కులు ఏమీ లేవు కాబట్టి జైన దేవాలయాలను, బౌద్ధ దేవాలయాలను కూల్చేసి మేము శివాలయాలు కట్టామని కాకతీయులు గర్వంగా చెప్పుకున్నారు. గుంటూరు జిల్లాలో అమరావతి ఉంది, అక్కడ బౌద్ధ స్థూపాన్ని కూల్చేసి అమరలింగేశ్వర స్వామి (శివుడి) ఆలయం కట్టారు. అన్ని మతాల వాళ్ళు తాము అధికారంలో ఉన్నపుడు పరమతాలకు చెందిన దేవాలయాలను, పూజాస్థలాలను కూల్చేసి వాళ్ళవి కట్టుకుని ఉన్నారు. ముస్లింలు కూడ అదే పని చేశారు. ఈ చేసిన వాటన్నిటిలోకి రామాలయమే ఎందుకు పనికొచ్చింది వాళ్ళకు అంటే రాముడి మీద ఉన్న విశ్వాసం రాజకీయాలకు వాడుకోవడానికి వారికి పనికొచ్చింది. రాముడి మీద విశ్వాసం లేకపోతే,

స్థానికంగా ఉండే చిన్న చిన్న దేవతల మీద మాత్రమే విశ్వాసాలు ఉంటే ఏం చేస్తారు వాళ్ళు అంటే ఆ చిన్న చిన్న దేవతల మీద ఉన్న విశ్వాసాన్నంతా క్రోడీకరించి దానిని హైందవ ప్రధాన దేవతలతో లింక్ చేస్తారు.

## శివాలయాలుగా మారుతున్న నాగోబా గుళ్ళు

మీరు ఎన్ని చోట్లయినా చూడండి. నిన్న మొన్నటి వరకు ఏదో గ్రామదేవత గుడిగా ఉన్నదల్లా క్రమంగా శివాలయంగా మారుతూ ఉంటుంది, లేదా ఆంజనేయస్వామి ఆలయంగా మారుతూ ఉంటుంది. అదిలాబాద్ జిల్లా వాళ్ళు చాలామంది ఇక్కడున్నారు. ఆదిలాబాద్ జిల్లాలో గోండులు నాగోబా అనే పేరుతో నాగుపామును దేవతగా పూజిస్తారు. ఇప్పుడు నాగోబా గుడులన్నీ క్రమంగా శివాలయాలుగా మారుతున్నాయి. ఎవరు మార్పిస్తున్నారు? విశ్వహిందూ పరిషత్ వాళ్ళు మార్పిస్తున్నారు. ఎందుకు పనికొస్తుంది ఇదంతా అంటే ప్రజలలో విడివిడి దేవుళ్ళ భక్తులుగా ఉండే వారందరినీ బ్రాహ్మణీయ హిందుత్వ దేవుడు అయిన శివుడి భక్తులుగా మార్చివేయడానికి ఉపయోగపడుతుంది. అప్పుడు ఆ భక్తి శివుడిని రాజకీయంగా వాడుకోవడానికి, అధికారం కోసం వాడుకోవడానికి వారికి ఉపయోగపడుతుంది. వాళ్ళు పని గట్టుకుని చేస్తున్నారు ఇదంతా.

అందువల్ల మనం ఇవ్వాళ నాగుపామును పూజించడం ఏమిటి, పాము ఎట్లా దేవుడవుతుంది అనేటువంటి విమర్శతో పాటు ఏ రాజకీయ పాత్రను నిర్వహించడానికి వాళ్ళు ఇదంతా చేస్తున్నారన్న దాని గురించి కూడ మనం చూడాల్సిన అవసరం చాలా ఉంది. అది చూడకుండా పాములో దేవుడుంటాడా, గాడిదలో దేవుడుంటాడా, ఆవులో దేవుడుంటాడా అనే విమర్శ మాత్రమే మనం పెడితే అది అసంపూర్ణం అవుతుంది, అది సరిపోదు.

మనం లౌకికవాదాన్ని ఏ రకంగా అర్థం చేసుకోవాలి, మతాన్ని ఏ రకంగా అర్థంచేసుకోవాలి, మతానికి సమాజం మీద, రాజకీయాల మీద ఉండే ప్రభావాన్ని ఏ రకంగా అర్థం చేసుకోవాలి అనే విషయంలో ఒక విస్తృతమైనటువంటి అవగాహన అవసరం. అసలు అర్థమంటూ చేసుకోవాలంటే, ఒక అవగాహనంటూ ఏర్పరచుకోవాలంటే మనం ఏ రకమైన సమాజాన్ని కోరుకుంటున్నామనే దాని మీద ముందుగా మనకు ఒక అవగాహన అవసరం. ఒక ప్రజాస్వామికమైన సమాజాన్ని కోరుకుంటుంటే మతం మనకు ఒక రకంగా కనిపిస్తుంది. ఒక సమసమాజాన్ని కోరుకుంటుంటే మనకు మతం మరో

రకంగా కనిపిస్తుంది. మనం నాస్తికులం కావచ్చు, నాస్తికులై కూడ మనం పెట్టుబడిదారీ వ్యవస్థను సమర్థించవచ్చు, ప్రైవేటు ఆస్తి ఉండాల్సిందే అనవచ్చు. అట్లా అనే వాళ్ళు మతాన్ని ఏ రకంగా అర్థం చేసుకుంటారు? కేవలం ఒక మూఢ నమ్మకంగా అర్థం చేసుకుంటారు. పాశ్చాత్యదేశాలలో మత వ్యతిరేకత వచ్చినప్పుడు అది ఏ రకంగా వచ్చింది, భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా పెట్టుబడిదారీ వ్యవస్థలో అంతర్భాగంగా వచ్చింది. అందువల్ల పాశ్చాత్యదేశాలలో నాస్తికత్వం అనేది మతాధికారులకు రాజకీయాలలో జోక్యం ఉండటానికి వీలు లేదు, మతమనేది కేవలం నీకు నీ దేవుడికి మధ్య సంబంధంగా ఉండాలి అనే భావనలో మాత్రమే వచ్చింది.

## అసమాన సమాజానికి ఆలంబనగా మతం

మన దగ్గర మతం ఇప్పుడున్న రూపంలో, అంటే వర్ణధర్మం, కులవ్యవస్థ రూపంలో ఉన్నంత కాలం అది అసమాన సమాజాన్ని నిలబెట్టడానికే దారి తీస్తుంది, ప్రజాస్వామ్యాన్ని నాశనం చెయ్యడానికే దారి తీస్తుంది. అందువల్ల మతం పట్ల వ్యతిరేకత అనేది ఏ రూపం తీసుకోవాలి – ఏ రాజకీయ రూపం తీసుకోవాలి, ఏ సామాజిక రూపం తీసుకోవాలి – అనేది మనకు భవిష్యత్ గురించి ఉండే ఆదర్శంతో ముడిపడి ఉంటుంది. మనం ప్రజాస్వామ్యాన్ని కోరుకుంటున్నామా, నియంతృత్వాన్ని కోరుకుంటున్నామా, మనం సమసమాజాన్ని కోరుకుంటున్నామా, లేక సామ్రాజ్యవాదం ఉండాలి, పెట్టుబడిదారీ వ్యవస్థ ఉండాలి అని కోరుకుంటున్నామా? అని ఆలోచించుకోవాలి. ఇది కోరుకున్నా, అది కోరుకున్నా మనం నాస్తికులం కావచ్చు. చాలామంది పెట్టుబడిదారులు నాస్తికులై ఉండొచ్చు. పెద్దపెద్ద పోలీసు ఆఫీసర్లు, ఎన్‌కౌంటర్లు చేసేవాళ్ళు, లాకప్ హత్యలు చేసేవాళ్ళు కూడ నాస్తికులైతే కావచ్చు. దానికి మనమేం చేస్తాం, మనకు కావాల్సిన నాస్తికత్వం అది కాదు. మనకు ప్రజాస్వామ్యంతో ముడిపడి ఉన్న నాస్తికత్వం కావాలి. సమ సమాజ ఆదర్శంతో ముడిపడి ఉన్న నాస్తికత్వం కావాలి. అప్పుడు ఏమవుతుందంటే మత విమర్శ అనేది సామాజిక విమర్శ అవుతుంది, రాజకీయ విమర్శ అవుతుంది. ఇవ్వాళ మతాన్ని కాపాడుకోవాలి అనేవాళ్ళు, కాపాడుకుంటాము అనేవాళ్ళు పైకి మాట్లాడేటప్పుడు మతాన్ని కేవలం ఆధ్యాత్మికమని మాత్రమే అంటారు. వాళ్ళు మనతో వాదన గాని పెట్టుకుంటే మీరు ఎంతసేపు తిండి కావాలి, బట్ట కావాలి, ఉద్యోగాలు కావాలి, సమానత్వం కావాలి, స్వేచ్ఛ కావాలి అంటారు, వాటితో పాటు మనిషికి ఒక ఆత్మ కూడ ఉంటుంది, ఆధ్యాత్మిక అవసరాలు కూడ ఉంటాయి, దాని కోసం మతం

కావాలి అని అంటారు కాని మతాన్ని వాస్తవంగా కాపాడుకోవటం అనే దగ్గరకు వచ్చేటప్పటికి వాళ్ళు మతాన్ని ఆధ్యాత్మికమైన ఒక ఆకాంక్షగా మాత్రమే కాకుండా ఒక సామాజిక సంబంధంగా కాపాడుకోవడానికే ఎప్పుడూ కూడ కృషి చేస్తారు.

మొన్న పాకిస్తాన్ నుంచి వచ్చినటువంటి ప్రొఫెసర్ ఒకాయన మాట్లాడుతూ ఇలా అన్నాడు. 'పాకిస్తాన్‌లో ఇవ్వాళ మేమెవరిమైనా సోషలిజమని, హేతువాదమని, నాస్తికత్వమని, కమ్యూనిజమని, డెమోక్రసీ అని మాట్లాడితే 'పాశ్చాత్య దేశాలలో వాళ్ళు మతాన్ని తిరస్కరించి ఏమయిపోయారు, విలువలు నాశనం అయిపోయాయి, స్వార్థం పెరిగిపోయింది, కాబట్టి మనం ఇస్లాం సంప్రదాయాన్ని కాపాడుకోవాలి అంటారు.' కాని మనం actual గా ఆచరణలోకి దిగి చూస్తే వాళ్ళు ఇస్లాం పేరు మీద దేనిని కాపాడుతున్నారంటే ఒక ఖుదా, ఒక భగవంతుడు అనే ఆ నమ్మకాన్ని మాత్రమే కాదు, ఆ నమ్మకంతో పాటు ఇస్లామిక్ సమాజంలో స్త్రీలపైన మగవాళ్ళకుండేటువంటి అన్యాయమైన ఆధిపత్యం ఏదైతే ఉందో దానిని కూడ కాపాడాలని వాళ్ళు ప్రయత్నం చేస్తారు. దానిని వాళ్ళు ఏ పేరు మీద కాపాడతారు? పురుషాధిక్యత పేరు మీద కాపాడరు, ఇస్లాం పేరు మీద కాపాడతారు. ఇస్లాం పేరు చెప్పి ఆడవాళ్ళకు స్వేచ్ఛ, స్వతంత్రం నిరాకరిస్తారు' అని చెప్పారు.

మొన్న తస్లీమా నస్రీన్ భారతదేశానికి వచ్చింది. బంగ్లాదేశ్‌లో ఆమె ఒక రచయిత్రి. ఇస్లామిక్ సంప్రదాయంలో స్త్రీలకు ఏ రకంగా అన్యాయం జరుగుతోందో ఆమె చెప్పింది. స్త్రీలకు అన్యాయం ఒక్కొక్క సంప్రదాయంలో ఒక్కొక్క రకంగా జరుగుతుంటుంది. మనం చాలా ఆశ్చర్యపోతాం గానీ మన కంటే చాలా విషయాలలో చాలా సైంటిఫిక్‌గా డెవలప్ అయిన పాశ్చాత్య దేశాలలో స్త్రీలకు అబార్షన్ చేసుకునే హక్కు లేదు. మన దేశంలో అబార్షన్ అనేది చాలావరకు సులభం అయ్యింది అనుకోవచ్చు, కొన్ని ఆంక్షలు ఉన్నప్పటికీ కూడ. పాశ్చాత్య దేశాలలో అబార్షన్ హక్కు కల్పిస్తానని చెప్పే రాజకీయ నాయకులకు ఓట్లు పడవని భయం. ఓడిపోతామని భయం. తమ మనసులో, తమ రాజకీయాలలో స్త్రీలకు ఆ స్వేచ్ఛ ఉండాలని నమ్మే వాళ్ళు కూడ ఎన్నికలకు వచ్చేటప్పటికి నేనేమి దానిని సపోర్టు చెయ్యడం లేదని చెప్పి ఓట్లు సంపాదించుకుంటారు. ఎందుకంటే ఆ క్రైస్తవ సంప్రదాయం అట్లాంటిది. తన ఇష్టానికి వ్యతిరేకంగా గర్భం వస్తే తీసేసుకునే స్వేచ్ఛ ఆ మతంలో స్త్రీలకు లేదు. ఇస్లాంలో స్త్రీల పరిస్థితి అయితే చివరికి కోర్టులో సాక్ష్యం

ఇచ్చేటప్పుడు కూడ ఇద్దరు ఆడవాళ్ళు సాక్ష్యమిస్తేనే ఒక మగవాడి సాక్ష్యానికి సమానం అవుతుంది. అంటే ఇస్లామిక్ సంప్రదాయంలో స్త్రీ మగవాడిలో సగం మాత్రమే. అంటే ఏమిటి? స్త్రీలపై అణచివేతను కాపాడటానికి మతాన్ని కాపాడుకుంటున్నారు, ఆధ్యాత్మికతను కాపాడుకుంటున్నారు అని. మీరు సమానత్వం పేరు మీద ఆధ్యాత్మిక విలువలను నాశనం చేసేసి మొత్తం అంతా మెటీరియలిజం చేసేస్తున్నారు, స్వార్థాన్ని పెంచేస్తున్నారు అని మనల్ని అంటూ, ఆధ్యాత్మికత పేరు మీద వాళ్ళు అసమాన సామాజిక సంబంధాలను కాపాడే ప్రయత్నం చేస్తూ వస్తున్నారు.

## సంప్రదాయం ముసుగులో కాపాడుతున్నది కులాన్నే

భారతదేశంలోని హిందుత్వవాదులు ఇవ్వాళ బహిరంగంగా మేము కులవ్యవస్థను సపోర్టు చేస్తున్నామని అనలేరు. ఆ రోజులు దాటిపోయాయి. వాళ్ళకు ఓట్లు కావాలి. దేశంలో నూటికి 75 శాతం ఉండేది ఎస్.సిలు, ఎస్.టిలు, బి.సిలు. వాళ్ళ ఓట్లు లేకపోతే ఎవరూ గెలవలేరు కాబట్టి, కులవ్యవస్థను మేము తిరిగి స్థాపిస్తాము, కాపాడతాము అంటే ఓట్లు రావు కాబట్టి బహిరంగంగా ఆ మాట అనరు, భారతీయ సంప్రదాయం అని మాత్రమే అంటారు. భారతీయ సంప్రదాయం పేరు మీద, భారతీయత పేరు మీద వాళ్ళు నిజంగా దేన్ని కాపాడాలి అనుకుంటున్నారు, దేన్ని నిలబెట్టాలి అనుకుంటున్నారు అంటే సంప్రదాయ హిందుత్వ వర్ణధర్మ విలువలనే. కులవ్యవస్థ రూపంలో కాకపోవచ్చు, రకరకాల అడ్డదారులలో వాళ్ళు దాన్ని కాపాడతారు.

రిజర్వేషన్ల ఉద్యమం వచ్చినప్పుడు మనం చాలా స్పష్టంగా గమనించాము. ఎస్.సిలకు, ఎస్.టిలకు, బి.సిలకు తెలివితేటలు ఉండవు అని నేరుగా పైకే అనలేరు కాబట్టి ఏమంటారు మెరిట్‌ను కాపాడకపోతే దేశం నాశనం అయిపోతుంది అంటారు. మెరిట్ ఎలా నిర్ణయిస్తారు? పరీక్షలు పెట్టండి మార్కులు ఎవరికొస్తే వాళ్ళకే మెరిట్ ఉన్నట్టు అని చెబుతారు. కాబట్టి మేమేమి తేడా చూపించడం లేదు, ఎస్.సిలకు మార్కులు వస్తే ఉద్యోగం ఇవ్వండి, మేమేమి వద్దనడం లేదు కదా అని పైకి అంటారు కాని మార్కులు రావడం అనేది, పరీక్షలలో విజయం సాధించడం అనేది, చదువుకొనే అవకాశం ఉండటం అనేది మనిషికుండే సామాజిక స్థితిగతులతో ముడిపడి ఉందా లేదా, అది కులంతో ముడిపడి ఉందా లేదా? ఆ ప్రశ్న వేసుకోరు. చిన్నప్పటి నుండి పుస్తకాలు, చదువు ఇవన్నీ ఉండేటువంటి బ్రాహ్మణులు గానీ, ఇతర అగ్రకులాలు గానీ వాళ్ళకుండే

అవకాశాలు ఎస్.సిలకు, ఎస్.టిలకు, బి.సిలకు ఉంటాయా? ఆ లేకపోవడం అనేది కులవ్యవస్థ నుంచి వచ్చిందా లేదా? అసమానత అనేది భారతదేశంలో, హిందుత్వ సంప్రదాయంలో సంప్రదాయకంగా కులం ప్రాతిపదిక మీదే కల్పించి నువ్వు గొర్రెలు మాత్రమే కాసుకో, నువ్వు పొలం మాత్రమే దున్ను, నువ్వు చెప్పులు మాత్రమే కుట్టు అన్న తరువాత, మెరిట్ ఎవరికుంటుంది, నువ్వు లెక్కపెట్టే మార్కులు ఎవరికుంటాయి అనే చర్చలోకి పోనే పోకుండా మాకు కుల వివక్ష ఏమీ లేదు, మార్కులు వస్తే వాళ్ళకు కూడ ఉద్యోగాలు ఇవ్వండి అని పైకి ఏమీ తేడా లేనట్టుగా మాట్లాడితే ఎలా? మేము ప్రతిభను మాత్రమే కాపాడుతున్నాం, ప్రతిభ లేకపోతే దేశం నాశనం అయిపోతుంది అని డొంకతిరుగుడు వాదనలు తీసుకొస్తే ఎలా?

## సరళీకరణ పేరు మీద చేస్తున్నదీ అదే

భారతీయ జనతాపార్టీ అగ్రనాయకుడు ఒకాయన జై దుబాషీ అని ఉన్నాడు. ఆయన ఇంకొక ఆర్గ్యుమెంట్ పెడతాడు రిజర్వేషన్లకు వ్యతిరేకంగా. బి.జె.పి వాళ్ళు ఇప్పటివరకు పైకి ఎప్పుడూ కూడ మేము రిజర్వేషన్లకు అనుకూలమే అంటూ వస్తున్నారు గానీ దేశంలో అన్ని చోట్ల మండల్ కమిషన్ వ్యతిరేక ఉద్యమంలో అగ్రభాగాన నిలబడింది ఎవరంటే బి.జె.పి వాళ్ళు, ఆర్ఎస్ఎస్ వాళ్ళు, ఎ.బి.వి.పి వాళ్ళే. ఆ జై దుబాషి అనే బి.జె.పి నాయకుడు ఆయన వ్యాసాలలో ఏమంటున్నాడు అంటే ఇవ్వాళ మనం అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలో భాగం కావాలనుకుంటున్నాము, ఆర్థిక సరళీకరణ చేస్తున్నాము, పునర్వ్యవస్థీకరణ చేస్తున్నాము, ఈ క్రమంలో మనం అమెరికాతో, ఫ్రాన్స్‌తో పోటీ పడాలంటే, విదేశీ మారక ద్రవ్యాన్ని తగినంత సంపాదించుకోవాలంటే అతినాణ్యమైన వస్తువులను ఎగుమతి చేసి సంపాదించుకోవాల్సి ఉంటుంది. కాబట్టి మనకు విదేశీ మారక ద్రవ్యం ఎక్కువ రావాలంటే రిజర్వేషన్లు అనీ, వెనకబడిన వాళ్ళకు ఏవో కొన్ని ప్రత్యేకమైన కోటాలు అనీ, వెనకబడిన ప్రాంతాలలో ఫ్యాక్టరీలు పెడితే వాళ్ళకు అమ్మకం పన్నులో, ఎక్సైజ్ సుంకంలో రాయితీలు అనీ ఇవన్నీ ఏవీ ఇవ్వకుండా ప్రతిభకు మాత్రమే, నాణ్యతకు మాత్రమే, సామర్థ్యానికి మాత్రమే పెద్ద పీట వేయాలి. అప్పుడే మనం అంతర్జాతీయంగా రాణించగలుగుతాము, అప్పుడే మనకు ఫారిన్ ఎక్స్చేంజ్ వస్తుంది, అప్పుడే మనకు బ్యాలన్స్ ఆఫ్ పేమెంట్ క్రైసిస్ పోతుంది అని దానికి ముడిపెడతాడు. ఆయన పార్టీ వాడే అద్వానీ ఏమంటాడు? భారతీయ సంప్రదాయం అంటాడు. ఈయనేమో ఫారిన్ ఎక్స్చేంజ్

అంటాడు. అన్నీ కలిసి ఎక్కడికి వస్తాయి చివరకు? భారతీయ సంప్రదాయమంటే హైందవ మతమని, హైందవ మతమంటే కేవలం దేవుడి మీద నమ్మకం కాదు ఒక జీవన విధానమని, జీవన విధానమంటే వర్ణధర్మమని. వర్ణధర్మమనే పేరు మీద హైందవ మతం మనుషులను అసమానులుగా ఏ విధంగా కేటాయించి పెట్టిందో ఆ కేటాయింపు పోకుండా ఉండటం కోసం చేస్తున్న ప్రయత్నమే ఇదంతా. సంప్రదాయం పేరు మీద, ఆర్థిక సమస్యల పేరు మీద, పునర్వ్యవస్థీకరణ పేరు మీద, సరళీకరణ పేరు మీద వీళ్ళు తిరిగి అదే వర్ణధర్మాన్ని డిఫ్యాక్టో ఆచరణలో నిలబెట్టాలని ప్రయత్నం చేస్తారు.

ఆచార్య వామదేవ్ లాంటివాడు ఓపెన్‌గా ప్రెస్ కాన్ఫరెన్స్ పెట్టి పాకిస్తాన్ వాళ్ళు ఖురాన్ ప్రకారం, షరియత్ ప్రకారం రాజ్యాంగం రాసుకున్నారు కదా, మనం కూడ మనుధర్మం ప్రకారం రాసుకుందామని అంటాడు. అద్వానీ గారు పొద్దున్నే ప్రెస్‌మీట్ పెట్టి ఏమంటాడు అంటే అది మా అభిప్రాయం కాదు అంటాడు. జరిగేది మాత్రం జరుగుతూనే ఉంటుంది. వాళ్ళు మనుషుల మెదళ్ళలోకి ఎక్కించే విషం మాత్రం ఎక్కిస్తూనే ఉంటారు. అందువల్ల ఇవ్వాళ మనం రాజ్యం–మతం మధ్య ఉన్న, ఉండాల్సిన సంబంధాల గురించి మాట్లాడుకుంటున్నామంటే వాళ్ళ వైఖరి ఏ రకంగా మారుతూ ఉంది, వాళ్ళ దృక్పథం ఏ రకంగా మారుతూ ఉంది, కోర్టులో జడ్జీలు ఏ రకంగా ఆలోచిస్తున్నారు, ఐఎఎస్ ఆఫీసర్లు ఏ రకంగా ఆలోచిస్తున్నారు, ఐపిఎస్ ఆఫీసర్లు ఏ రకంగా ఆలోచిస్తున్నారు? అనేవి జాగ్రత్తగా అర్థం చేసుకోవాల్సి ఉంటుంది.

మేము చాలాసార్లు పౌరహక్కుల పనులలో భాగంగా కలుస్తూ ఉంటాం ఐఎఎస్ ఆఫీసర్లను, ఐపిఎస్ ఆఫీసర్లను. మీరు గ్రామంలో ఎస్.సిలకు పట్టాలిస్తామన్నారు ఇవ్వలేదు ఇంతవరకు, ఇళ్ళ కాలనీలు కట్టిస్తామన్నారు, ఇంకా కట్టివ్వలేదు, వాళ్ళకు మిగులు భూములు పంచేస్తే తినడానికి తిండైనా దొరుకుతుంది గదా అని చెబుతుంటాం. కాని వాళ్ళు చాలా ఓపెన్‌గా అంటుంటారు ఈ హక్కులు అనేది చాలా ఎక్కువయి పోయింది అని. ప్రతి ఒక్కరూ హక్కుల గురించి మాట్లాడుతున్నారే గానీ, డ్యూటీల గురించి ఎవరూ మాట్లాడటం లేదు అని. మన భారతీయ సంప్రదాయంలో ఏమనుంది, నీ ధర్మం నువ్వు ముందు చెయ్యి హక్కులు తర్వాత వస్తాయని ఉంది అని.

నిజానికి హక్కుల గురించి భారతీయ సంప్రదాయంలో ఎక్కడా లేదు; కాని అదొకటి చేరుస్తున్నారు, మళ్ళీ వస్తాయని చేరుస్తున్నారు వాళ్ళు. అంటే హక్కుల గురించి

మాట్లాడకపోతే కుదరదు కాబట్టి హక్కులు మళ్ళీ వస్తాయి, ముందు ధర్మం పాటించు అని చెపుతున్నారు. భగవద్గీతలో అదే కదా చెప్పింది, కాబట్టి మన భారతీయ సంప్రదాయమే సరయినది, దాని ప్రకారం పోతేనే దేశం బాగుంటుంది అంటారు. చూడండి ఎక్కడ దాకా వచ్చిందో! ఎస్.సిలకు ఇళ్ళ కాలనీలు కట్టిస్తానన్నావు, కట్టివ్వలేదు అని అంటే ముందు డ్యూటీ చెయ్యి అని చెపుతాడు. డ్యూటీ ఏంటి? కూలి చెయ్యడం...అంతే గదా. కూలి చెయ్యకుండా బతుకుతున్నారా వాళ్ళు? కూలి చేసే బతుకుతున్నారు వాళ్ళు. కూలి చేసినా గూడు ఏర్పరచుకోలేక పోతున్నారు కాబట్టి ఇళ్ళకాలనీ కావాలని అడుగుతున్నారు, పట్టాలు కావాలని అడుగుతున్నారు. దానికి సమాధానం చెప్పకుండా ధర్మం గురించి ఎవరూ ఆలోచించడం లేదు, డ్యూటీ గురించి ఎవరూ ఆలోచించడం లేదు, ఎంతసేపు హక్కులు, హక్కులు అంటున్నారు, దేశం నాశనమై పోతోంది అనడం ఏమిటి? ఈ ఆలోచన ఎక్కడి నుంచి వచ్చింది వాళ్ళకు. భారతీయత, భగవద్గీతలో ఉండే హిందుత్వ సంప్రదాయం నుంచి వచ్చింది. నేనే మనుషులను అసమానంగా సృష్టించాను, నేనే మనుషులకు వేరు వేరు ధర్మాలను కేటాయించాను, ఆ ప్రకారం బతకండి, భవిష్యత్ జన్మలో మీకు హక్కులు వస్తాయని భగవద్గీత అంటే ఇవ్వాళ కలెక్టర్‌గారు లేదులే, ఈ జన్మలోనే వస్తాయని అదనంగా అంటున్నాడంతే. అంతకంటే ఎక్కువేమీ అనడం లేదు.

## సామాజిక న్యాయంలో భాగంగా మతం గురించి ఆలోచించండి

అందువల్ల మిత్రులకు మేము చెప్పేదేమిటంటే భారత రాజ్యాంగంలో మనం ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం అని ఎందుకు రాసుకున్నాం, we the people of India have dedicated to ourselves this constitution అని ఎందుకోసం రాసుకున్నామో ఆలోచించండి. ఏదో ఒక గవర్నమెంట్ రావడం కోసం కాదు, పి.వి. నరసింహారావు, కోట్ల విజయభాస్కర రెడ్డి లాంటి వాళ్ళు ఓట్లు గుద్దుకొని ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి అయి పరిపాలించడం కోసం కాదు, మసీదులు కూల్చేసి గుళ్ళు కట్టేసి ప్రభుత్వం ఏర్పాటు చెయ్యడం కోసం కాదు. సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని ప్రాతిపదికగా గలిగిన సమాజాన్ని నిర్మించుకోవడం కోసమే ఈ రాజ్యాంగాన్ని మనకు మనం అర్పించుకున్నాం. అంటే రాజ్యాంగంలో అంతా బాగుందా అంటారేమో! అంతా ఏమీ బాగా లేదు, కొంచెం బాగుంది, కొంచెం బాగా లేదు. అది పక్కన పెట్టండి గానీ preamble లో ఏదైతే చెప్పుకున్నామో సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని ప్రాతిపదికగా

గల సమాజాన్ని నిర్మించుకోవాలని చెప్పి, ఆ ఆదర్శంలో భాగంగా మనం మతాన్ని గురించి ఆలోచిద్దాం. ఆ ఆదర్శంలో భాగం కాకుండా ఎవరైనా నాస్తికులు ఉంటే ఉండవచ్చును, వాళ్ళతో మనకు అనవసరం. ఈ ఆదర్శంలో భాగంగా నాస్తికత్వాన్ని గురించి ఆలోచిద్దాం, మతాన్ని గురించి ఆలోచిద్దాం. అలా ఆలోచించాలి అంటే మతానికుండే సామాజిక పాత్ర, మతానికుండే రాజకీయ పాత్ర, ప్రత్యేకించి హిందూ మతానికి సామాజిక వ్యవస్థలో, రాజకీయ వ్యవస్థలో ఉన్న పాత్ర, దాన్ని పెంచుకుంటూ పోయే కొద్దీ సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం అనే ఆదర్శం ఎట్లా వెనకడుగు వేస్తుంది అనేది అర్థం చేసుకోవాలి. ఆ సామాజిక, రాజకీయ దృక్పథంతో మతాన్ని, మతతత్వాన్ని చూడాలి. ఆ దృక్పథంతో మతాన్ని వ్యతిరేకించాలి అని అర్థం చేసుకుని నాస్తిక ఉద్యమాన్ని అందులో అంతర్భాగంగా నిర్మించే ప్రయత్నం చేస్తారని ఆశిస్తూ నేను సెలవు తీసుకుంటున్నాను.

*భారత నాస్తిక సమాజం మహాసభలలో ఇచ్చిన ఉపన్యాస పాఠం, 1994.*
*ఊరు, తేదీ తెలియదు. ఇదే శీర్షికతో దీని ఆడియో balagopal.org లో ఉంది.*

# హిందూ మతతత్వం
# భారత రాజకీయాలు

నేను ప్రధానంగా హిందుత్వవాద ప్రమాదం గురించి మాట్లాడతాను. ముస్లిం మతోన్మాదం లేదా? దాని వల్ల ప్రమాదం లేదా? అంటే ఆ చర్చలోకి నేను పెద్దగా పోదల్చుకోలేదు. ముస్లిం మతోన్మాదం ఉంది, మత ఛాందసత్వమూ ఉంది. ఇవి రెండూ ఒకటి కాదు. దాని వల్ల బహుశా హిందువుల కంటే ముస్లింలకే నష్టం ఎక్కువ, ప్రమాదం ఎక్కువ. అయితే ప్రస్తుతం భారత రాజకీయాలలో ఒక ఆధిపత్య శక్తిగా, రాజకీయాలలో మాత్రమే కాదు, సామాజిక జీవితంలో, సామాజిక వ్యవస్థలో కూడ ఈ హిందూత్వం అనేది చాలా బలంగా ముందుకు వస్తున్నది. దానిని ఎదుర్కొనే కర్తవ్యం కేవలం ముస్లింలది కాదు. దాని వల్ల ప్రమాదం కేవలం ముస్లింలకు కాదు, కేవలం క్రైస్తవులకు కాదు, మొత్తంగా మనం ప్రజాస్వామ్యం అనుకునేదానికి – అది రాజకీయ ప్రజాస్వామ్యం గానీయండి, సామాజిక ప్రజాస్వామ్యం గానీయండి – ప్రమాదం చాలా ఉంది కాబట్టి దానిని ప్రధానంగా దృష్టిలో పెట్టుకొని మాట్లాడతాను.

లౌకికవాదాన్ని కాపాడుకోవాలి, మత ఛాందసత్వాన్ని మతోన్మాదాన్ని వ్యతిరేకించాలి అని మనం అందరం కూడ ఉమ్మడిగా అంగీకరిస్తూనే, వాటిని ఎట్లా అర్థం చేసుకుంటాము అనే విషయంలో మన మధ్య అభిప్రాయ భేదాలుండొచ్చు. ఉండటం సహజమే, దాంట్లో ఆశ్చర్యపోవలసింది కూడ ఏమీ లేదు. నేను మతతత్వాన్ని ప్రధానంగా సామాజికంగా అర్థం చేసుకొని మాట్లాడతాను. హిందుత్వం గురించి మామూలుగా అంటుంటారు, అదొక మతం కాదు, జీవన విధానమని. ఒక్క హిందూమతం మాత్రమే కాదు, అన్ని మతాలు కూడ జీవన విధానాలే. అదేదో హిందుత్వానికుండే ప్రత్యేకత ఏమీ కాదు. అన్ని మతాలు ఒక సామాజిక వ్యవస్థను మన ముందు పెడతాయి. ప్రామాణికమైన సామాజిక సంబంధాలను, ప్రామాణికమైన జీవిత విలువలను, ప్రామాణికమైన ప్రవర్తనను నిర్దేశిస్తాయి. నిర్దేశించడం మాత్రమే కాదు, అదొక ఆదేశంగా కూడ మారుతాయి. ప్రామాణికమైనటువంటి

ఆ సామాజిక సంబంధాలను అతిక్రమించినా, ఆ జీవన విధానాన్ని తిరస్కరించినా, అందుకు భిన్నంగా ప్రవర్తించినా ఆ మతంలో ఏదో ఒక రకమైనటువంటి శిక్ష – అది భౌతిక దండన కావచ్చు, వెలివేత కావచ్చు, పరలోకంలో నీకు సుఖం ఉండదు, శాంతి ఉండదు అని భయపెట్టడం కావచ్చు, లేదా పునర్జన్మ నమ్మకాలు ఉండేటట్లయితే పునర్జన్మ హీనంగా ఉంటుందని భయపెట్టడం కావచ్చు – ఏదో ఒకటి తప్పక ఉంటుంది. ప్రతి మతం కూడ ఒక సామాజిక వ్యవస్థకు అనుబంధంగా ఉంటుంది, ఒక సామాజిక వ్యవస్థను తనలో ఇముడ్చుకుని ఉంటుంది. కాబట్టి ప్రతి మతమూ ఒక జీవన విధానమే. ఆ కోణం నుంచి హిందుత్వాన్ని చూసి, ఇవ్వాళ హిందూ మతతత్వం లేక హిందుత్వ రాజకీయాలు బలపడటం సామాజిక జీవితంలో, రాజకీయాలలో కూడ ఏ రకంగా ప్రమాదకరం అనేది నేను మాట్లాడదామనుకుంటున్నాను.

ఎందుకంటే దేవుడు అనే భావన, దేవుడి మీద విశ్వాసం – అది కొంతవరకు వేరే విషయం. దాన్ని మనుషులు ఎందుకు విశ్వసిస్తారు, ఎందుకు ఆ భావన బలంగా ఉంది, ఎందుకు అది పోవడం లేదు అనే దానికి సులభమైన సమాధానం ఉందని నేను అనుకోవడం లేదు. కేవలం ప్రకృతికి సంబంధించి కొంత అజ్ఞానం ఉండటం వల్లనో లేదా జీవితంలో నిరాశ, నిస్పృహలు ఉండటం వల్లనో దైవభావన బతికి ఉందని నేను అనుకోవడం లేదు. ఆ కారణాల విశ్లేషణలోకి నేను పోదల్చుకోలేదు.

సామాజిక వ్యవస్థగా, సామాజిక జీవన ప్రమాణంగా మతాన్ని చూసినప్పుడు, ఎందుకు ఇవ్వాళ భారత సమాజంలో, భారత రాజకీయాలలో హిందుత్వ ఆధిపత్యం ఇంతగా ముందుకు వస్తూ ఉంది? దాని వల్ల రాగల ప్రమాదం ఏమిటి?అది కేవలం ముస్లింలకు, క్రైస్తవులకు మాత్రమే ప్రమాదకరమా? బాబ్రీమసీదు కూల్చేశారు, ఇంకా కొన్ని మసీదులు కూల్చేస్తామంటున్నారు. పెద్ద చిట్టా ఉంది మా దగ్గర అంటున్నారు. మసీదులను కూల్చేయడం అంటే ఒక భవంతినో, ఒక నిర్మాణాన్నో కూల్చేయడం మాత్రమే కాదు, అది ఒక మతానికి సంబంధించినటువంటి ఐడెంటిటీ మీద దాడి చేయడం, వారి ఆత్మగౌరవం మీద దాడి చేయడం అని గుర్తిస్తున్నాం. ఆ గుర్తింపుతోనే ముస్లింలు చాలా ప్రాంతాలలో తీవ్రంగా స్పందించారు. అప్పటి వరకు తమను తాము ముస్లింలుగా భావించని వారు సహితం – అంటే మతపరంగా – దానిని తమ ఆత్మగౌరవం మీద దాడిగానే భావించి సహజంగానే స్పందించారు. స్పందించినందుకు వాళ్ళ మీద దాడులు జరిగాయి.

ముంబాయిలో బాబ్రీ మసీదు కూల్చివేత తరువాత కోపంతో రోడ్లమీదకు వచ్చిన ముస్లింల మీద పోలీసులు, శివసేన వాళ్ళు, విశ్వహిందూ పరిషత్ వాళ్ళు భయంకరమైన దాడిచేసి, ఊచకోత కోసి చంపారు. ఇది మనకు పరిచయమున్న చరిత్రే. క్రైస్తవుల మీద దాడులు ఈ మధ్యకాలంలో గుజరాత్, పంజాబ్, ఒరిస్సా, మధ్యప్రదేశ్‌లలో, కేరళలో కూడ ఒకటి రెండు చోట్ల జరిగాయని చెప్పి పత్రికలలో వార్తలు చదివాము. దాడి చేసేవాళ్ళు దాడి చేస్తూ ఉంటే, తగలబెట్టే వాళ్ళు తగలబెడ్తూ ఉంటే, చంపేవాళ్ళు చంపుతూ ఉంటే, మాకు అలాంటి ఉద్దేశం లేదు అంటూనే మత మార్పిడుల మీద చర్చ జరగాలి అని వాజ్‌పేయి మాట్లాడుతూ ఉంటాడు. మత మార్చిడుల వల్లే మేము దాడి చేస్తున్నామని వాళ్ళు అంటూ ఉంటే అవును దాని మీద చర్చ జరగాల్సిందే అనడం పరోక్షంగా వాళ్ళను సమర్థించడమే అవుతుంది. దేశ ప్రధానమంత్రే ఆ పని చేస్తున్నాడు. కాని ఇక్కడితోఆగిపోలేదు ప్రమాదం. నిజానికి ఇక్కడితో ఆగిపోయినా అది చాలా ప్రమాదకరమే. అప్పుడు కూడ ప్రజాస్వామిక భావాలు, మానవతా భావాలు ఉండే వాళ్ళందరూ ముస్లింలకి, క్రైస్తవులకి అండగా నిలబడాలి. ఒక మైనారిటీగా వాళ్ళు తమ ఉనికిని కాపాడుకోవడానికి సహకరించాలి, సహాయం చెయ్యాలి. కానీ ఇక్కడితో మాత్రమే ఆ ప్రమాదం ఆగిపోలేదు.

## సరళీకరణకు హిందుత్వానికి కుదిరిన జోడి

హిందుత్వవాద ఆధిపత్యం మొత్తంగా మన సమాజానికి, సమాజం యొక్క పురోగమనానికి, ప్రజాస్వామీకరణకు శత్రువు. నిర్దిష్టంగా హైందవ సమాజంలో భాగంగా వాళ్ళే చెప్పుకునే దళిత బహుజన కులాలకు, స్త్రీలకు, ఎన్నడూ హైందవ సమాజంలో భాగం కాకపోయినా బలవంతంగా హైందవ సమాజంలో భాగంగా ప్రకటింపబడిన ఆదివాసులకు, వీరందరి ఉనికికి, అభ్యున్నతికి అది ప్రమాదకరం. ఇవ్వాళ దేశ రాజకీయార్థిక విధానాలలో, ఇతర రంగాలలో వస్తున్న మార్పులు, హిందుత్వ ఆధిపత్యం ఒక దానికి ఒకటి బాగా అతికిన విషయాలు.

ఆర్థిక విధానాలలో వస్తున్నటువంటి కొత్త నీతిని మనం చూస్తున్నాం. కొత్త ఆర్థిక విధానాలు సామాన్యుల మనుగడకు, జీవనానికి, హక్కులకు వ్యతిరేకమైన, శత్రుపూరితమైన ఆర్థిక విధానాలు. వాటిని మన ముఖ్యమంత్రిగారు బ్రహ్మాండంగా క్రోడీకరించి విజన్ 2020 అనే పేరు మీద వదిలాడు ప్రపంచం మీదికి. కాని ఇది ఆయనొక్కడి దృక్పథమే కాదు, మొత్తంగా ఈ దేశం యొక్క పాలకనీతి అది. ఈ దేశమే కాదు, మూడో ప్రపంచ

దేశాలందరి పాలక నీతి. ఏ పాలక నీతి అయినా, ఏ రకమైన రాజకీయ ఆర్థిక విధానాలైనా దానికి తగినటువంటి సంస్కృతిని ప్రోత్సహించాలని కూడ ప్రయత్నం చేస్తాయి. ఎందుకంటే మనుషులు దానికి తగినట్లు ప్రవర్తించాలి కదా. దానికి తగిన విలువలు, దానికి తగినటువంటి ఆచరణ కలిగి ఉండాలి కదా. అందువల్ల ఆ రకమైన ఆలోచనల్ని, ఆ రకమైన విలువల్ని సమాజంలో ప్రోత్సహించే ఆవశ్యకత కూడ రాజకీయ ఆర్థిక రంగాలలో కొత్త నీతిని ప్రవేశపెడ్తూ ముందుకు వచ్చేటువంటి పాలకులకు ఉంటుంది. ఇవి రెండూ ఒకదానికొకటి అతుక్కొని ముందుకు వస్తున్నాయి ఇవ్వాళ.

హక్కుల గురించి అడగొద్దు, జీవనం గురించి అడగొద్దు, నీ మనుగడ గురించి అడగొద్దు, దొరికితే ఉపాధి సంపాదించుకో, లేకపోతే చావు. తిండి దొరికితే తిను, లేకపోతే ఆకలికి మాడు అనే ఆర్థిక నీతికి హిందుత్వం చాలా బాగా అతికినటువంటి భావజాలం. సంక్షేమానికి తావు లేదు, సమానత్వానికి తావు లేదు, అయ్యోపాపం అనడానికి కూడ తావు లేదు. హక్కుల సంగతి పక్కన పెట్టండి, అయ్యోపాపం అనే భావనకు కూడ తావు లేదు. పెట్టుబడి పోగుపడాలి, పోగుపడాలి, ఇంకా బ్రహ్మాండంగా పోగుపడాలి. మన ముఖ్యమంత్రిగారు 10 శాతం పెరుగుదల రేటు కావాలంటున్నాడు. ఇప్పుడు నాలుగు శాతం లేదు ఆంధ్రప్రదేశ్‌కు. కష్టపడితే అయిదో, ఆరో కావచ్చేమో. పది శాతం పెరుగుదల రేటు కావాలంటే దానికి 30 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడి కావాలి, ఆ పెట్టుబడికి కావాల్సిన వసతులు, వనరులు అన్నీ ఇవ్వాలి. భూమి కావాలంటే భూమి ఇవ్వాలి. చెరువులలో, నదులలో, సముద్రంలో ఉన్న చేపలు మా కంపెనీలకే కావాలంటే వాళ్ళకే ఇచ్చేయాలి. మరి జాలరులు ఏమవుతారు, దళితులు ఏమవుతారు, భూమి లేని వాళ్ళు ఏమవుతారు, ఇళ్ళ స్థలం లేని వాళ్ళు ఏమవుతారు అంటే, ఏమైనా అవండి మీరు, మాకు సంబంధం లేదు అనే నీతికి తగినటువంటి ఒక తాత్విక ఆలోచన వారికి దొరికింది. నువ్వు ఎక్కడ ఉంటే అక్కడే ఉండు అదే నీ ధర్మం, నీ స్థానం నీకు నిర్దేశించిన జీవితం జీవించు, అదే నీ ధర్మం, నీ స్థానం నీకు నిర్దేశించిన జీవితం నీకు బాగాలేకపోయినా పరాయి స్థానం కోసం మాత్రం నువ్వు ఆశపడొద్దు, అది వినాశహేతువు అని చెప్పే మతం ఈ నీతికి చాలా బాగా అతుకుతుంది.

## హిందుత్వ వ్యాప్తి వెనక ఉన్నది పెత్తందారీ శక్తులే

ఈ హిందుత్వ శక్తులను ఎవరు సమర్థిస్తున్నారు అని మనం గమనిస్తే, కేవలం ఛాందసులు అయిన బ్రాహ్మణులు మాత్రమే కాదు, వాళ్ళు ఎట్లాగూ సమర్థిస్తూనే

ఉంటారు, వాళ్ళు మాత్రమే సమర్థిస్తే సమాజంలో ఇది బలమైన శక్తి కాదు. బలమైన శక్తి కాగలిగింది అని అంటే కేవలం జంధ్యం వేసుకునే, పిలక పెట్టుకునే బ్రాహ్మణులు మాత్రమే కాకుండా అనేక ఇతర సామాజిక శక్తులు కూడ ఇవ్వాళ ఈ హిందుత్వవాదుల వెనకాల ఉన్నారు. ఎవరు వాళ్ళంతా? ఈ యాభై ఏళ్ళలో మన సామాజిక జీవితంలో రకరకాల ఉద్యమాలు, ఆకాంక్షలు, ప్రభుత్వం వైపునుంచి సంస్కరణలు, రాజ్యాంగమూ చట్టమూ కల్పించిన అవకాశాలు, వీటిని ఆసరాగా చేసుకుని సమాజంలో ఏ ప్రజాస్వామీకరణ అయితే జరిగిందో – అది దళితుల విషయంలో కానివ్వండి, ఆదివాసుల విషయంలో కానివ్వండి, స్త్రీల విషయంలో కానివ్వండి, కార్మికుల విషయంలో కానివ్వండి, వ్యవసాయ కూలీల విషయంలో కానివ్వండి – ఏ ప్రజాస్వామీకరణ అయితే గత యాభై సంవత్సరాలలో ఉద్యమాల ద్వారా, పోరాటాల ద్వారా, సంస్కరణల ద్వారా కొంత మేరకైనా జరిగిందో దాని వల్ల నష్టపోయినటువంటి ఆధిపత్య శక్తులు, దాని వల్ల తమ ఆధిపత్యాన్ని ఏదో ఒక మేరకు తగ్గించుకోవాల్సి వచ్చిన – పూర్తిగా కోల్పోకపోయినా – తగ్గించుకోవాల్సి వచ్చినటువంటి పెత్తందారీ శక్తులు, వాళ్ళ నిరసన ఇవ్వాళ హిందుత్వవాదం పైకి రావడం వెనకాల ఉంది. ఎందుకంటే ఆ నిరసనకు తగినటువంటి భావజాలం ఇది. చాలా ఉదాహరణలు ఇయ్యవచ్చు.

ఇవ్వాళ దళితుల గురించి ఏం మాట్లాడినా అన్నీ వాళ్ళకే ఇవ్వాలంట అనే ఒక నిరసన ఉంది సమాజంలో. మైనారిటీలుగా ముస్లింలకు తమ మతాన్ని గానీ, తమ ఆలోచనలను గానీ, తమ సంస్కృతిని గానీ ఆచరించే హక్కు ఉంటుంది అనంటే విపరీతమైన ఆవేశం సమాజంలో. పాకిస్తాన్‌లో ఉందా, సౌదీ అరేబియాలో ఉందా, అక్కడ లేనిది ఇక్కడెందుకు. మైనారిటీ, మైనారిటీ అని చెప్పి వాళ్ళు ప్రత్యేక హక్కులు కోరుకుంటున్నారు, జన జీవన స్రవంతికి దూరంగా ఉండాలి అని కోరుకుంటున్నారు అని మరో కోపం. కార్మికుల హక్కుల గురించి మాట్లాడితే కార్మికుల వల్లే ఆర్థిక వ్యవస్థ నాశనం అయిపోయింది, వాళ్ళు సమ్మెలు చేయబట్టే నాశనం అయిపోయింది అని ఇంకొక నిరసన, ఒక కోపం. అవునా, కాదా అని చూసే ఓపిక ఎవరికీ లేదు.

హక్కులు లేని వాళ్ళు హక్కులు సాధించుకుంటే, సామాజిక గౌరవం లేని వాళ్ళు గౌరవం సాధించుకుంటే దాని పట్ల నిరసన. సమాజంలో వాళ్ళు హక్కులు సాధించుకోవడం వల్ల, వాళ్ళు గౌరవం సాధించుకోవడం వల్ల తమ ఆధిపత్యాన్ని పెత్తనాన్ని కొంతవరకు కోల్పోయిన వాళ్ళలో వచ్చే నిరసన, ఒక అప్రజాస్వామికమైన పెత్తందారీ నిరసన. ఇది

మనకు అనేక సందర్భాలలో, అనేక విషయాలలో కనిపిస్తూ ఉంటుంది. అదే ఇవ్వాళ హిందుత్వవాద రాజకీయాలు పైకి రావడం వెనకాల ఉంది. ఆ ప్రమాదాన్ని మనం చూడాలి. లేకపోతే మనకు క్రికెట్ పిచ్ తవ్వేస్తాం, క్రికెట్ ఆడనివ్వం లాంటి కొన్ని పిచ్చి చేష్టలే కనిపిస్తాయి. క్రికెట్ మంచి ఆటో కాదో, ఆడవచ్చో ఆడకూడదో, చూసేవాళ్ళు పిచ్చివాళ్ళో కాదో అది వేరే విషయం. కాని వీళ్ళ దౌర్జన్యం ఏమిటని? దౌర్జన్యం చెయ్యగలగడం మాత్రమే కాదు, ప్రెస్ కాన్ఫరెన్స్ పెట్టి మరీ చెప్పగలుగుతున్నారు పాకిస్తాన్ క్రికెట్ టీమ్ ఢిల్లీ వస్తే పిచ్ తవ్వేస్తామని. వేరెవరైనా ఆ మాట అంటే టెర్రరిస్టులు అంటారు వాళ్ళను, కాల్చేస్తారు పోలీసులు. కాని వీళ్ళు అనగలుగుతున్నారు, అని చలాయించుకో గలుగుతున్నారు. ఇందుకు తమ రాజకీయ ఆధిపత్యాన్ని వాడుకుంటున్నారు. వాళ్ళ జోలికి పోతే ఏమవుతుందో అని అధికార యంత్రాంగం, సమాజం మొత్తం భయపడేలా చేస్తున్నారు.

## శివసేనది టెర్రరిజం అనరే...

ముంబాయిలో శివసేనవాళ్ళు, విశ్వహిందూ పరిషత్ వాళ్ళు, ముఖ్యంగా శివసేన వాళ్ళు మీ యంత్రాంగాన్ని వాడుకొని, మీ సహకారంతో ముస్లింలను ఊచకోత కోస్తూ ఉంటే మీరు ఎందుకు ఆపలేదని ఆ తరువాత జరిగినటువంటి శ్రీకృష్ణ కమిషన్ విచారణలో జడ్జీగారు పోలీసులను అడిగారు. ఒక్కొక్క పోలీసు అధికారినీ ఆయన 'తెలుసు గదా మీకు వాళ్ళు ఈ పని చేస్తున్నారని, ఎందుకు ఆపలేదు? వాళ్ళు మీటింగులు పెట్టుకుంటే ముస్లింల మీద ద్వేషాన్ని రెచ్చగొడతారని మీకు తెలుసు గదా ఎందుకు పర్మిషన్ ఇచ్చారు? ఫలానా శివసేన ఎం.ఎల్.ఎ జీపునిండా బాంబులు పెట్టుకొని పోతూ మీకు దొరికారు కదా, ఎందుకు కేసు పెట్టలేదు' అని అడిగితే పోలీసు ఆఫీసర్స్ ఏమని జవాబు చెప్పారంటే– చెయ్యొచ్చుండి, కాని చేస్తే మళ్ళీ ఏమవుతుందోనని భయపడ్డాం అంటారు. వేరెవరి గురించి అయినా పోలీసులు ఆ మాట అనరే. ఎవర్నో పట్టుకుని నువ్వు నక్సలైటువి అని తెలంగాణలో పట్టుకుపోయి కాల్చేస్తారు కదా లేదా అరెస్టు చేసి చిత్రహింసలు పెడతారు కదా. కాల్చేస్తే ఏమవుతుందో అని భయపడ్డాం అనరే. అంటే కొంతమందికి ఆ అవకాశం సమాజంలో ఇవ్వబడుతుంది – టెర్రరిజం చేసే అవకాశం.

భారతదేశంలో అందరి కంటే పెద్ద టెర్రరిస్టులు ఇవ్వాళ శివసేనవాళ్ళు. నక్సలైట్లు కాదు, కాశ్మీరీ టెర్రరిస్టులు కాదు, ఎవ్వరూ కాదు. మిగిలిన టెర్రరిస్టులు తమ టెర్రరిజానికి

మూల్యం చెల్లిస్తారు. అది మంచా చెడా అనే విషయం పక్కకు బెట్టండి. వీళ్ళు మూల్యం చెల్లించకపోగా టెర్రరిజాన్ని చలాయించడానికి కావాల్సిన అవకాశాన్ని అనుభవిస్తున్నారు. దాని వెనకున్నటువంటి సామాజిక వాస్తవం ఏమిటంటే ఈ ఆలోచనారీతికి సమాజంలో పెరుగుతున్న, బలపడుతున్న సపోర్టు. ఆ సపోర్టు ఎక్కడనుంచి వస్తూ ఉంది అనంటే అన్ని రకాల ప్రజాస్వామ్యాన్ని ద్వేషించేటువంటి వాళ్ళ నుండి అది వస్తూ ఉంది. వాళ్ళలో పెద్ద పెద్ద పెట్టుబడిదారులు మాత్రమే కాదు, పెద్ద పెద్ద భూస్వాములు మాత్రమే కాదు, మనబోటివాళ్ళూ చాలామంది ఉంటారు. మనలోనే దళితుల ఆకాంక్షలను ద్వేషించే వాళ్ళు ఉంటారు, ఇంట్లో భార్య నువ్వెంతో నేనూ అంతే అంటే ఆమె స్వేచ్ఛా ఆకాంక్షను, సమానత్వ కాంక్షను ద్వేషించే వాళ్ళు ఉంటారు, తమ కిందిస్థాయి ఉద్యోగులు హక్కులు కావాలంటే, సమ్మె చేస్తామంటే ద్వేషించే వాళ్ళు ఉంటారు. ఇలాంటి వాళ్ళు చాలామందే ఉంటారు సమాజంలో. వీళ్ళంతా ఆయా స్థాయిలలో ఆధిపత్య శక్తులే. వాళ్ళు వేరే ఆధిపత్యానికి లోబడేవాళ్ళు అయితే కావచ్చు, వేరే ఆధిపత్యం వల్ల నష్టపోయే వాళ్ళు అయితే కూడ కావచ్చు. వీరి సపోర్టు పెరగడం వల్ల ఏమవుతుంది అంటే ఇష్టారాజ్యంగా మాట్లాడటానికి, దౌర్జన్యాలు చేయడానికి వాళ్ళకు అవకాశాలు పెరుగుతున్నాయి.

ఫలానా పాకిస్తానీ గాయకుడు బొంబాయి రావడానికి వీల్లేదు అని వాళ్ళు అంటే బొంబాయి మున్సిపల్ కార్పొరేషన్ వాళ్ళు, బొంబాయిలోని కళా రంగాల వాళ్ళు ఇక్కడొద్దులే వేరే చోట పెట్టుకుంటాం అని వాళ్ళే అంటున్నారు. వీళ్ళేమీ చెప్పనక్కరలేదు. పాకిస్తాన్ క్రికెట్ మ్యాచ్ బొంబాయిలో ఆడటానికి వీల్లేదు అంటే బొంబాయిలో వాళ్ళ మ్యాచ్‌లు ఆగిపోయాయి. చాలా ఏళ్ళయిపోయింది పాకిస్తానోళ్ళు బొంబాయిలో క్రికెట్ మ్యాచ్ ఆడక. ఎక్కడెక్కడో ఆడుతున్నారు. మంచి చెడు విషయం కాదు ఇక్కడ; ఆధిపత్యం, పెత్తందారీతనం ఇంతగా చలాయించగలుగుతున్నారు, ఇంత అనాగరికంగా చలాయించ గలుగుతున్నారు. బాల్‌థాకరే అనే ఒక్క మనిషి అక్కడ కూర్చొని ఇష్టమొచ్చినట్లు ఆదేశాలు జారీ చేస్తూ ఏ రకమైన శిక్ష (penal consequences) పడకుండా తప్పించుకో గలుగుతున్నాడు అంటే దాని వెనకున్నటువంటి ప్రమాదకరమైన సామాజిక సూచనను చూడండి.

పైగా హిందుత్వాన్ని, హిందుత్వ ఫిలాసఫీని ధర్మం అనడమొకటి! మనం కూడ పొరపాటున చాలాసార్లు జస్టిస్ అనే ఇంగ్లీషు మాటకు అనువాదంగా ధర్మమని వాడుతున్నాం. వాడొద్దని నా మనవి. ఎందుకంటే ధర్మమనే భావనకు బ్రాహ్మణ వాసనలు

పోలేదు. ధర్మమనే భావనకు ఇప్పటికీ దానిని అంటుకుని ఉన్న అర్థం వర్ణాశ్రమ ధర్మమనే. నీ స్థానానికి తగినట్టు నువ్వు ఉండు, అన్యం కోరుకోవద్దు, అదే ధర్మం. ప్రజాస్వామ్యం దానికి సరిగ్గా భిన్నమైనది. ఇక్కడ ఎవరికీ నిర్దేశించిన స్థానాలు ఏమీ ఉండవు. సమానత్వం కోరుకోవడం ఇక్కడ ఒక హక్కు, మనిషై పుట్టినందుకు నిండైన మనిషిగా ఎదగడానికి కావాల్సిన అన్ని అవకాశాలు కోరుకోవడం ప్రజాస్వామ్యంలో ఒక హక్కు. మనిషై పుట్టినందుకు ఎక్కడ పుట్టావో అక్కడే ఉండు, అంతకంటే అన్యం కోరుకోవద్దనేది హైందవ ధర్మం. ఈ భావన ప్రజాస్వామ్యమనే భావనకు పూర్తిగా విరుద్ధమైనది.

ఆ భావనను ఆలంబన చేసుకున్నటువంటి సామాజిక ఆలోచనా రీతికి ఒకప్పుడు ఆదరణ ఎక్కువ లేదు. బాపనోళ్ళు, కోమటోళ్ళు మాత్రమే పోయేది RSS శాఖలకు. ఇవ్వాళ చాలామంది పోతున్నారు. ఎందుకోసం పోతున్నారంటే ఈ ఆలోచనా రీతి సమాజంలో అన్ని రకాల పెత్తందారీ ఆధిపత్య శక్తులకు బలం చేకూరుస్తోంది కాబట్టి. దాని అజెండా ముస్లింలతో ప్రారంభమయింది. నాకు బాగా జ్ఞాపకం – బాబ్రీ మసీదు కూల్చివేత తరువాత మేము మీటింగ్‌లు పెట్టి మాట్లాడుతూ ఉంటే ఇతరత్రా పరిచయమున్న క్రైస్తవ మిత్రులు కొంతమంది – క్రైస్తవంలో ఉన్న లిబరేషన్ థియాలజీని నమ్మేవాళ్ళు – మా మీటింగులకు వచ్చేవారు. క్రైస్తవులు ఇంకొంత ఎక్కువగా కదలలేరా అని అంటే క్రైస్తవులలో కూడ చాలామందికి ముస్లింల పట్ల హిందువులలో ఉన్న అభిప్రాయాలే ఉన్నాయని చెప్పారు. ముస్లింలు మరీ మతవాదులు, అన్నిట్లోనూ తాము వేరనుకుంటారు, అందువల్ల వాళ్ళకి అయ్యింది. మేమట్లా కాదు, కలిసిపోయాం గదా మేము బాగా, మాకేం కాదు, ముస్లింలు పెడసరంగా ఉంటారు కాబట్టే అలా అయింది – ఇదీ వాళ్ళ అభిప్రాయం. ముస్లింల గురించి హిందువులలో సామాన్యంగా ఉండే అభిప్రాయాలే ఇవి. అందువల్లే ముస్లింల మీద దాడి జరిగింది అని తప్ప ఇదొక ఎదుగుతున్నటువంటి సామాజిక ఆధిపత్య శక్తి యొక్క వ్యూహంలో భాగం లేదా ఆ శక్తి యొక్క వ్యక్తీకరణలో భాగం అనేటువంటి ఆలోచన క్రైస్తవులలో ఆ రోజు లేదు.

అకస్మాత్తుగా గుజరాత్‌లో దాడులు జరిగి, పంజాబ్‌లో దాడులు జరిగి, ఒరిస్సాలో స్టెయిన్స్ ఘోరమైన హత్య, ఆయన పసిపిల్లల సజీవ దహనం జరిగిన తరువాత ఇవ్వాళ క్రైస్తవులలో కదలిక వచ్చింది. చాలామంది మేము అప్పుడే కదిలి ఉండాల్సింది అని ఇప్పుడు అనుకుంటున్నారు. కాని మనం జాగ్రత్తగా ఆలోచిస్తే మండల్ కమిషన్ వచ్చినప్పుడు

చాలా బలంగా మండల్ కమిషన్‌ను వ్యతిరేకించిన వాళ్ళు ఎవరు? మన దగ్గర మండల్ కమిషన్ పట్ల వ్యతిరేకత పెద్దగా ఉద్యమాల రూపం తీసుకోలేదు. ఎందుకంటే కులం గురించి, కుల వివక్ష గురించి, కుల నిర్మూలన గురించి చర్చ ఇక్కడ చాలా కాలంగా సాగుతూ ఉంది. అలవాటయిపోయింది ఆధిపత్య కులాలకు కూడ. ఇష్టమున్నా లేకపోయినా ఒప్పుకోక తప్పదు దీనిని, ఏమీ చెయ్యలేమని గుర్తించారు వాళ్ళు. ఉత్తర భారతంలో ఇంకా అలవాటు కాలేదు. ఉదాహరణకు మన దగ్గర ఒ.బి.సి రిజర్వేషన్ రాష్ట్ర ప్రభుత్వంలో 20 ఏళ్ళకు పై నుంచే ఉంది. ఉత్తర భారతదేశంలో ఇప్పటిదాకా లేదు. కాబట్టి మండల్ కమిషన్ వచ్చినప్పుడు విపరీతమైన వ్యతిరేకత ఉత్తర భారతదేశంలో వచ్చింది. ఆ ఆందోళనలో అగ్రభాగాన నిలబడ్డ వాళ్ళంతా ఎవరు? విద్యార్థి రంగంలో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ వాళ్ళు, రాజకీయ రంగంలో భారతీయ జనతాపార్టీ వాళ్ళు. పార్టీగా భారతీయ జనతాపార్టీ ఏమీ మాట్లాడలేదు. మాట్లాడితే ఓట్లు పోతాయి కాబట్టి. కాని ఆ పార్టీకి సంబంధించిన వాళ్ళు, విశ్వహిందూ పరిషత్ ఆలోచనా రీతి ఉన్నవాళ్ళు, ఆర్‌ఎస్‌ఎస్ ఆలోచనా రీతి ఉన్నవాళ్ళు మండల్ కమిషన్ వ్యతిరేక ఆందోళనలో అగ్రభాగాన నిలబడ్డారు.

వెనకబడ్డ కులాల వాళ్ళు ముస్లింలు కాదు, క్రైస్తవులు కాదు, వాళ్ళు హిందువులే కదా మీ లెక్క ప్రకారం – తాము కాదని వాళ్ళు ఇవ్వాళ అంటున్నారు, అది వేరే సంగతి – మరి దేనికి వారి రిజర్వేషన్లను వ్యతిరేకిస్తున్నావు నువ్వు? ముస్లింల మీద దాడి చేసినపుడు వాళ్ళు వేర్పాటువాదులు, వాళ్ళు అన్యసంస్కృతిని భారతదేశంలో ప్రవేశపెడ్తున్నారు, వాళ్ళు భారతదేశం నాగరికతను, సంస్కృతిని own (ఓన్) చేసుకోరు, రాముడిని మా దేవుడు అనరు అని అన్నావు. క్రైస్తవుల మీద దాడులు చేసినపుడు వాళ్ళు మతాంతరీకరణ చేస్తున్నారు, అన్య మతాన్ని ప్రవేశపెడుతున్నారు, మన దేశ సంస్కృతిని విచ్ఛిన్నం చేస్తున్నారు అన్నావు. మరి బి.సిలపైన దాడులు ఎందుకు చేశావు నువ్వు, వాళ్ళు హిందువులే కదా నీ లెక్క ప్రకారం. ఇక్కడ సమస్య అన్యమతం కాదు, దేశభక్తి కాదు; ఎవ్వరూ సమానత్వం కోరుకోకూడదు, ఎవ్వరూ హక్కులు కోరుకోకూడదు అంతే.

## వారి దాడి క్రైస్తవం మీద కాదు, దళితుల మీద

క్రైస్తవం మీద దాడి వాస్తవానికి క్రైస్తవం మీద దాడి కాదు, దళితుల మీద దాడి. హైందవ మతానికి బహిష్కృతులుగా, సమాజం వెలుపల చాకిరీ చేసే వాళ్ళుగా, అణిగి మణిగి ఉండేవాళ్ళుగా మేము ఉండం, మేము వేరే మతం, కనీసం దేవుడి కళ్ళలో

సమానత్వం ఇచ్చే మతాన్ని మేము ఎంచుకుంటాం అని వాళ్ళు అనుకున్నందుకే ఆ దాడి. మీరు హిందువులు కారు, మిమ్మల్ని మేము మాలో చేర్చుకోం, అయినా మా అదుపులో మాత్రం మీరు ఎప్పటికీ ఉండాలి, మీరు బయటకు పోవడానికి వీలు లేదు అని కంట్రోల్ చేసే ఆధిపత్యం నుంచి వచ్చినటువంటి వ్యతిరేకత అది. అది క్రైస్తవం మీద దాడి కాదు, దళితుల మీద దాడి, ఆదివాసుల మీద దాడి. ఎన్నడూ వీళ్ళు ఆదివాసులను హిందువులుగా భావించలేదు, ఎన్నడూ దళితులను హిందువులుగా భావించలేదు. అయినా బహిష్కృతులుగా వాళ్ళు ఉండాలి. బహిష్కరించడానికి ఒక బహిష్కృతుడు కావాలి. నువ్వు బహిష్కరించడానికి నేనిక్కడ ఉండను, నేను వేరే మతంలోకి పోతాను, నువ్వు ఏం చేయగలవో నేనూ చూస్తాను అని అంటే దాడి చేస్తారు. ఈ దాడి నిజానికి వాళ్ళకుండే స్వేచ్ఛపైన దాడి. స్వేచ్ఛ అంటే మరేం లేదు, బహిష్కృతులుగా మీ సమాజం చుట్టూ ఆవరించుకొని మేముండం, మేము బయటకి పోతాం అనడమే వాళ్ళ దృష్టిలో నేరం.

ఫైర్ అనే సినిమా మీద దాడి చేశారు. ఆ సినిమా అంటే నీకిష్టం లేకపోతే చర్చ పెట్టు. చాలామంది విమర్శించినట్టే నువ్వూ విమర్శించు. ఇది మంచిదా, చెడ్డదా? ఈ రకంగా ఉండొచ్చా, ఉండకూడదా? స్వలింగ సంపర్కం అనేది కరెక్టా కాదా? అని చర్చ పెట్టవచ్చు. ఇక్కడ సమస్య అది కాదు. ఎందుకు ఆ సినిమా మీద అంత ద్వేషం అంటే ఆధిపత్యం కోల్పోతామన్న భయం. సినిమా అశ్లీలంగా ఉందన్నారు. అంతకంటే భయంకరమైన అశ్లీలం అనేక సినిమాలలో ఉంది. ఏ సినిమా పైనైనా దాడి చేశారా వాళ్ళు ఎప్పుడైనా? రేప్ సీనులు వరుసగా చూపించే ఏ సినిమా మీద కూడ విశ్వహిందూ పరిషత్‌వాళ్ళు, ఆర్ఎస్ఎస్ వాళ్ళు ఎప్పుడూ దాడి చెయ్యలేదు, ధర్నా చెయ్యలేదు, ఆపెయ్యాలని రాళ్ళు వెయ్యలేదు, ప్రదర్శించడానికి వీల్లేదని సినిమా టాకీసు మీద దాడి చెయ్యలేదు. దీని మీదే ఎందుకు దాడి చేశారు? ఎందుకంటే ఇందులోని స్త్రీ పాత్రలు మగవాళ్ళు నిర్దేశించిన లైంగిక నీతిని మేము పాటించం, మేము మా మార్గం ఏదో ఎంచుకుంటాం అన్నారు. అంటే మీ కంట్రోల్ నుంచి బయటకు పోతాం అన్నారు. హైందవం మాత్రమే కాదు, అన్ని మతాలు కూడ స్త్రీని మగవాడి అదుపులో ఉంచేటటువంటి సామాజిక ఆచరణ, నీతినే నిర్దేశించాయి. వాటినే స్త్రీకి ప్రామాణిక విలువలుగా నిలబెట్టాయి. ఆ కంట్రోల్ నుంచి మేము బయటకు పోతాము అని ఫైర్ లాంటి సినిమాలు, దాంట్లో ఉన్న ఆలోచనలు చెప్పడం వారికి సహించరాని విషయం అయింది. అది అశ్లీలం మీద ఉద్యమం కాదు, భావప్రకటన స్వేచ్ఛపైన దాడి కాదు. ఒక రకంగా చూస్తే భావప్రకటన

స్వేచ్ఛ పైన దాడే కాని దాన్లో కీలకమైన, మౌలికమైన విషయం ఏమిటంటే కంట్రోల్. ఏ కంట్రోల్ అది? బ్రాహ్మణీయ భావజాలానికి, బ్రాహ్మణీయ సామాజిక విలువలకు మొత్తం మన భారత సమాజం పైన ఉండే కంట్రోల్. ఆ కంట్రోల్ నుంచి దళితులు, ఆదివాసులు, స్త్రీలు ఎవరూ బయటకు పోవడానికి వీలు లేదు. అందుకే క్రైస్తవులపైన దాడులు. అందుకే మతమార్పిడులపైన ఇంత వ్యతిరేకత. అందుకే ఫైర్ లాంటి సినిమాల మీద దాడి. ఆ సినిమా వెయ్యడానికే వీలు లేదు.

## చర్చకు ఇష్టపడరు, ఏకంగా దాడి చేస్తారు

వాళ్ళ స్వభావం ఏమిటంటే దేన్నీ చర్చించరు వాళ్ళు. చాలాసార్లు మాకు అనుభవం. ఢిల్లీలో ఒకసారి కాశ్మీర్ మీద మీటింగ్ పెడతామని ఒక కాలేజీ వాళ్ళు పిలిస్తే నేను వేరే పనిమీద ఢిల్లీ వచ్చినపుడు వస్తానన్నాను. సాయంత్రం వాళ్ళే మళ్ళీ ఫోన్ చేసి రావొద్దు సార్ అన్నారు. ఏమయ్యింది అన్నాను. మా కాలేజీలో ఎ.బి.వి.పి వాళ్ళు ప్రిన్సిపాల్‌ను బెదిరించారు కాశ్మీర్ మీద ఇక్కడ మీటింగ్ జరగడానికి వీల్లేదన్నారని చెప్పారు. పెట్టేవాళ్ళు వామపక్ష విద్యార్థి సంస్థ వాళ్ళు. అయితే ప్రిన్సిపాల్ గారు అన్నారంట మీ స్పీకర్‌ను మీరు పిలవండి, వాళ్ళ స్పీకర్‌ను వాళ్ళు పిలుస్తారు, ఇద్దరూ మాట్లాడవచ్చు కదా కాశ్మీర్లో ఏమి జరుగుతుందనే దాని మీద అని. వీల్లేదు, మాకు చర్చ అక్కర్లేదు, బెంచీలు పగలకొడతాము, మైకు విరగగొడతాము అన్నారట వాళ్ళు. వాళ్ళకు చర్చ అక్కర్లేదు, కంట్రోల్ కావాలి. క్రైస్తవం మంచి మతమా, హైందవం మంచి మతమా, అసలు ఏ మతమూ మంచిది కాదా, ఇలా దేని మీద అయినా చర్చ పెట్టుకుని ఎంతైనా మాట్లాడుకో ఎవరికీ అభ్యంతరం లేదు. కన్విన్స్ చేసుకుంటే చేసుకో నువ్వు. స్వలింగ సంపర్కం సరయినదా కాదా? స్త్రీలకు స్వేచ్ఛ ఉండొచ్చునా, ఉండకూడదా? హిందూ ధర్మం చెప్పిన రీతిలో బతకడమే స్త్రీలకు మంచిదా? ఇవన్నీ మీటింగ్‌లు పెట్టి చెప్పుకో. మనం చెప్పుకుంటున్నాం కదా మీటింగ్‌లు పెట్టి. కొంతమందివైనా అభిప్రాయాలు మారతాయేమోనని చెపుతూ ఉంటాం కదా! వాళ్ళకు కావాల్సింది అది కాదు. పెత్తనం ద్వారా, హింస ద్వారా, బలప్రయోగం ద్వారా కంట్రోల్ చెయ్యడం. దేనిని కంట్రోల్ చెయ్యాలి? ప్రజాస్వామిక ఆకాంక్షలను కంట్రోల్ చెయ్యాలి. సమానత్వకాంక్షను కంట్రోల్ చెయ్యాలి. మనిషై పుట్టినందుకు అందరు మనుషులతో సమానంగా నేను జీవిస్తాను అనే

ఒక స్వాభావికమైన, ప్రజాస్వామికమైన ఆకాంక్షను, కోరికను కంట్రోల్ చెయ్యాలి. ఈ ధోరణే ఇప్పుడు పెద్ద ప్రమాదంగా ముందుకు వస్తున్నది.

## ఏకలవ్య, శంభూకుల దగ్గర నుండి ఇవే హత్యా రాజకీయాలు

హిందుత్వంలోనూ సరిగ్గా దీనికి తగినటువంటి భావన, ఆలోచన ఉంది. ఏకలవ్యుడు విద్య నేర్చుకుంటాను అంటే నేర్చుకోవడానికి వీల్లేదని ఎవరూ అతనితో చర్చేమీ పెట్టుకోలేదు. వేలు నరికేశారు అంతే. శంభూకుడు తపస్సు చేస్తానంటే అతను చెయ్యడానికి ఎందుకు వీల్లేదో, తాము మాత్రమే ఎందుకు చేయవచ్చో, తమకు మాత్రమే ఆ హక్కు ఎందుకు ఉందో వారు చర్చేమీ పెట్టుకోలేదు, చంపేశారు అంతే. బల ప్రయోగం ద్వారా ఆధిపత్య సామాజిక వ్యవస్థను నిలబెట్టే సంస్కృతి వారిది. ఆ వ్యవస్థ ఎట్లాంటిది? నిచ్చెన మెట్ల వ్యవస్థ.అంబేద్కర్ బాగా వర్ణించి చెప్పిన వ్యవస్థ అది. ప్రతి ఒక్కరికి పైన ఒకడు, కింద ఒకడు ఉంటాడు. పైవాడికి కాళ్ళు మొక్కటం, కింది వాడిని నెత్తిమీద తన్నడం. ఆ రకంగా ఆ మొత్తం అసమాన వ్యవస్థ చాలా పకడ్బందీగా నిలుస్తుంది. నీవు నిచ్చెనలో ఏ మెట్టు మీద ఉన్నావో అక్కడే ఉండు. అక్కడ ఉంటే వచ్చే జన్మలో కనీసం ఇంకొక మెట్టు పైన పుడతావు నువ్వు, అది కాదన్నావో పూర్తిగా నిచ్చెన కిందికి పోతావు అనే భయంతో నిలబెట్టారు దాన్ని ఇన్నాళ్ళు. ఇవ్వాళ ఆ భయం ఎక్కువగా పని చెయ్యడం లేదు కాబట్టి భౌతిక బల ప్రయోగం అవసరం అవుతోంది. మతం మార్చుకుంటే చావగొడతాం, చర్చీలను తగలబెడతాం, మసీదులను కూల్చేస్తాం, మార్చుకున్న వాళ్ళను చంపుతాం, మా కంట్రోల్ నుంచి బయటకు పోయి స్త్రీలు మా లైంగిక జీవితం ఏ విధంగా ఉండాలో మేము మాట్లాడుకొని నిర్ణయించుకుంటాం అంటే ఒప్పుకోం. అటువంటి సినిమాలు తియ్యనియ్యం అంటున్నారు. వినకుండా తీస్తే ఆ సినిమాలు తీసిన ప్రొడ్యూసర్, డైరెక్టర్‌లు ఆ తరువాత రోజు నుంచి ఎస్కార్ట్ పెట్టుకుని తిరగాలి. ఈ ధోరణి చాలా ప్రమాదకరం.

## ముస్లిం మతతత్వమూ ఉంది

మతతత్వం ఒక్క హిందువులలోనే ఉందా అంటే ముస్లింలలోనూ ఉంది. అది ఎంత హాని చేస్తుందో బహుశా హైదరాబాద్‌లో బతికే వాళ్ళకు ఇంకా బాగా తెలుసు. హైదరాబాద్ పాతబస్తీలో హిందూ మతోన్మాదానికి జవాబు ముస్లిం మతోన్మాదమే అనుకోవడం వల్ల ఇప్పుడక్కడ రెండు మతోన్మాదాలే మిగిలాయి. ఇంకేమీ మిగలలేదు. కనీసం ఒక రోడ్డు బాగాలేదనో, ఒక కాలవ శుభ్రంగా లేదనో, ఒక స్కూలు లేదనో ఒక

ఆందోళన గానీ, ఉద్యమం గానీ, ఒక డిమాండ్ గానీ, ఒక చర్చ గానీ హైదరాబాద్ పాతబస్తీలో ఉండదు. ఎందుకంటే ఒక మతతత్వానికి జవాబు ఇంకొక మతతత్వం అనుకోవడం వల్ల. అది రాజకీయంగా, సామాజికంగా ముస్లింలకు చాలా నష్టం చేస్తుంది.

ఏ ముస్లిం స్త్రీ అయినా లేదా పురుషుడు అయినా సనాతన ఛాందసత్వాన్ని నేను తిరస్కరిస్తాను అంటే ఆ ఛాందసం గురించి చర్చ జరగదు ముస్లింలలో. చర్చ ఏం జరుగుతుంది అంటే దీని వల్ల హిందువులకు ప్రయోజనం కలుగుతుంది, మన మనుగడే ప్రమాదంలో పడుతుంది. జాగ్రత్త అనే భయం పెడతారు. స్త్రీలను కూడ అదే విధంగా కంట్రోల్ చేస్తారు. వారిలో మతతత్వం లేదని నేను అనడం లేదు. మాట్లాడాలి దాని గురించి కూడ. వద్దని నేను అనడం లేదు గానీ లౌకికవాదులుగా, ప్రజాస్వామికవాదులుగా మనం ఎక్కువ ఎదుర్కోవాల్సింది హిందుత్వ ఆధిపత్యాన్ని. ఇది రాజకీయాలలోనే కాదు, మొత్తం సామాజిక జీవితంలో కూడ చాలా బలంగా పెరుగుతోంది. బొంబాయిలో శివసేనవాళ్ళు చేసినటువంటి హత్యాకాండకు పోలీసు యంత్రాంగం మొత్తం ఎంతగా సహకరించిందో ఈ పాటికి మీలో చాలామంది వినే ఉంటారు, వ్యాసాలూ అవీ చదివే ఉంటారు. చాలామంది పోలీసు ఆఫీసర్లు సైతం ఓపెన్‌గా ఒప్పుకున్నారు. శివసేన కార్యకర్తల్లాగా మాట్లాడకపోయినా, ఆర్ఎస్ఎస్‌లో చేరకపోయినా, బి.జె.పికి ఓట్లు వేయకపోయినా ఒక ఆలోచనా రీతిగా మాత్రం హిందుత్వ ఆలోచనా రీతి చాలా బలంగా ఇవ్వాళ సమాజం మొత్తం వ్యాపించింది.

ఇది ఇవ్వాళ మెజారిటీ అగ్రకుల హిందువులందరిలోనూ ఉన్న బలమైనటువంటి ఆలోచనారీతి. వాళ్ళు ఓట్లు ఎవరికైనా వెయ్యవచ్చు. ఓట్లు వెయ్యడానికి ఎన్నో రకాల కారణాలు ఉంటాయి. అగ్రకుల హిందువులలో మాత్రమే కాకుండా బి.సి కులాల నుంచి పైకి పోయిన వాళ్ళు కూడ ఆ పైకి పోయిన స్థానం నుంచి వచ్చినటువంటి కొత్త ఆలోచనా రీతిలో భాగంగా ఈ హిందుత్వ తాత్విక దృక్పథాన్ని తమలో అంతర్లీనం చేసుకోవడం జరుగుతోంది. బి.జె.పి కి వచ్చే ఓట్లలో మాత్రమే ఇది మనకు కనిపిస్తుంది అనుకుంటే చాలా పొరపాటు. మేధావి రంగంలోనూ చాలా బలంగా ఉంది ఇది ఇవ్వాళ. మన బ్యూరోక్రసీని శాసించే ఐఎఎస్ ఆఫీసర్లలోనూ చాలా బలంగా ఉంది. మా కోర్టులలో కూర్చునే జడ్జీలలోనూ చాలా బలంగా ఉంది. మనకు ఇష్టమున్నా లేకపోయినా సమాజం యొక్క విధాతలు వీళ్ళందరూ కూడ. ఇంతకుముందు చెప్పినట్టుగా బి.జె.పికి ఓటు వేస్తారని

కాదు, ఆర్‌ఎస్‌ఎస్ శాఖలకు పోతారని కాదు, విశ్వహిందూ పరిషత్ మీటింగులకు పోతారని కాదు, లేదా త్రిదిండి చినజియ్యర్ స్వామి వస్తే అక్కడికి పోయి కూర్చుంటారనేది కాదు. కూర్చుంటే కూర్చుంటారు అది వేరే సంగతి.

అంతకంటే ముఖ్యమైనది ఒక ఆలోచనా రీతిగా హైందవ ప్రాపంచిక దృక్పథం పెరుగుదల, అది చేయగల చేటు. ఎక్కడ ఉంటే అక్కడే ఉండు, అన్యం కోరుకోవద్దు, ఎప్పటికో కొంత మేలు జరిగితే అదే నీ భాగ్యం అనుకో. ప్రజాస్వామ్యం కోరుకోవద్దు, సమానత్వం కోరుకోవద్దు, హక్కులు కోరుకోవద్దు, అదంతా వినాశ హేతువు అనే భగవద్గీత మాటలు ఏవైతే ఉన్నాయో దానిని మొత్తం జీర్ణించుకుని ఆ ఆలోచనా రీతిని తమ ప్రాపంచిక దృక్పథంగా మార్చుకున్న వాళ్ళు ఇవ్వాళ సమాజంలో అన్ని రంగాలలో కూడ ఆధిపత్య స్థానాలలో ఉన్నారు. హిందుత్వం గురించి మాట్లాడే వారెవరైనా దాని ప్రాపంచిక దృక్పథంలోని అప్రజాస్వామిక పెత్తందారీ గుణాలు, అవి చేస్తున్న చేటు, దాని వల్ల వస్తున్న కీడు, అది పదేళ్ళుగా అనుసరిస్తున్నటువంటి నూతన రాజకీయ ఆర్థిక విధానాలకు భావజాలంగా ఎంత బాగా అతుకుతున్నాయి అనే విషయాలను దృష్టిలో పెట్టుకోవడం అవసరం.

## కులనిర్మూలనే మనకు లౌకికవాదం

భారతదేశంలో లౌకికవాదం అంటే రాజ్యం మతం నుండి స్వతంత్రంగా ఉండాలి, మతంతో ప్రమేయం ఉండకూడదు అనే ఒక్క అంశం మాత్రమే కాదు. అది సెకండరీ అంశం. భారతదేశంలో లౌకికత అంటే కులనిర్మూలన. వర్ణాశ్రమ ధర్మ సంస్కృతిని, వర్ణాశ్రమ ధర్మాన్ని, కులాన్ని వ్యతిరేకించడమే భారతదేశంలో లౌకికవాదం. అదే కీలకమైనది, అదే కేంద్రమైనది. లౌకికవాద నిర్వచనంలో రాజ్యానికి, మతానికి ఉన్న సంబంధం అనేది పాశ్చాత్య దేశాలలో ప్రధానమైన చర్చ.ఆయా దేశాల చరిత్ర నుండి వచ్చిన నిర్వచనం అది. మనకు కూడ అది అవసరమే. కాదని నేను అనడం లేదు. రాజ్యం మతానికి అతీతంగా ఉండాలి. కాని అది సెకండరీ విషయం. ప్రధానమైన విషయం ఏమిటంటే రాజ్యం మాత్రమే కాదు, మన సామాజిక జీవితం, రాజకీయ జీవితం, ఆర్థిక జీవితం మొత్తం అంతా కూడ వర్ణాశ్రమ ధర్మ భావజాలం నుంచి, కుల వ్యవస్థ నుంచి విముక్తి పొందడమే మన దగ్గర లౌకికవాదం.

ఇవ్వాళ ఆ లౌకిక వాదానికి జరుగుతున్న ప్రమాదం కేవలం ఒక మినిస్టర్ గారు

ఒక యజ్ఞానికి పోతున్నారనో, మరొకటో కాదు, అవి తప్పే, విమర్శించాల్సిందే, కాని అది అక్కడే ఆగిపోలేదు, దానిని దాటి చాలా దూరం పోయి వర్ణాశ్రమ ధర్మ తాత్విక దృక్పథం ఇవ్వాళ మళ్ళీ సామాజిక వ్యవస్థను, రాజకీయ వ్యవస్థను శాసిస్తూ ఉంది. ఆర్థిక వ్యవస్థకు భావజాలంగా అది పనిచేస్తూ ఉంది. ఆ ప్రమాదాన్ని మనం గుర్తించి లౌకకవాదం కోసం కృషి చేయడం, మతతత్వాన్ని వ్యతిరేకించడం అంటే ఏ వర్ణాశ్రమ ధర్మ భావజాలం సామాజిక రాజకీయ ఆర్థిక రంగాలలో ప్రబలంగా ఉందో దానిని వ్యతిరేకించడం అనే అర్థంలో స్వీకరించి కృషి చేయాలన్నది నా అభిప్రాయంగా మీకు చెబుతూ, నేను ఇక్కడ మాట్లాడిన ఈ విషయాలు మీకు చెప్పడానికి అవకాశం ఇచ్చినందుకు భారత నాస్తిక సమాజానికి ధన్యవాదాలు తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

*భారత నాస్తిక సమాజం సభలలో ఇచ్చిన ఉపన్యాస పాఠం.*
*1999–2000 ప్రాంతాల్లో కావచ్చు ఊరు, తేదీ తెలియదు.*
*ఇదే శీర్షికతో దీని ఆడియో* balagopal.org *లో ఉంది.*



"భారతదేశంలో లౌకికవాదం అంటే కులాన్ని వ్యతిరేకించడం; లౌకికవాదాన్ని కాపాడుకోవడమంటే వర్ణధర్మాన్ని, వర్ణవ్యవస్థను, కులవ్యవస్థను, కుల ఆధిక్యతను వ్యతిరేకించడం. అదీ లౌకికవాదాన్ని కాపాడుకోవడమంటే, లౌకికవాదాన్ని నిలబెట్టుకోవడమంటే. ఇవ్వాళ ఆ భారతీయ సంప్రదాయం భారతీయత అనే పేరు మీద బహిరంగంగా ముందుకు వచ్చింది. ఒక్క భారతీయ జనతా పార్టీ, విశ్వహిందూ పరిషత్ వాళ్ళు మాత్రమే కాదు, మొత్తంగా దేశంలో అధికారంలో ఉండేవాళ్ళు, ఆధిపత్యంలో ఉండే వాళ్ళందరూ కూడ తమ అధికారాన్ని, తమ ఆధిపత్యాన్ని, తమ సంపదను, తమ పెత్తనాన్ని నిలబెట్టుకోవడానికి ఇవ్వాళ అది తప్ప వేరే మార్గమేమీ లేదని భావిస్తున్నారు.

ఎందుకంటే ఒక్క భారతీయ వర్ణధర్మం మాత్రమే సమాజంలో ఎవరికి కేటాయించిన స్థానంలో వాళ్ళను సంతృప్తిగా పడి ఉండమని చెపుతుంది. ఇంతకంటే మెరుగైన జీవితం కోరుకోవద్దు, హక్కులు కోరుకోవద్దు అని చెప్పే ధర్మం అదే కాబట్టి మన ఆధిపత్యాన్ని, మన సంపదను, మన అధికారాన్ని, మన పెత్తనాన్ని కాపాడుకోవడానికి భారతీయ సంప్రదాయమే సరయినది అని చెప్పి ఇవ్వాళ అనుకుంటున్నారు. అందువల్ల ఇవ్వాళ మతానికి రాజ్యానికి మధ్య ఉండే సంబంధం గురించి మాట్లాడుతున్నామంటే భారత సామాజిక వ్యవస్థలోను, భారత రాజకీయ వ్యవస్థలోను మతం నిర్వహిస్తున్న పాత్ర, హైందవ మతం పేరు మీద వర్ణధర్మం నిర్వహిస్తున్న పాత్ర, దానిని గుర్తించడం, దానిపట్ల అప్రమత్తంగా ఉండటం, దానిని వ్యతిరేకించడం అందులో చాలా ముఖ్యమైన అంశం అవుతుంది. కేవలం మూఢనమ్మకాలను విశ్వసించడం మాత్రమే మతం కాదు."

**Rs. 50/-** **మానవహక్కుల వేదిక ప్రచురణ**